వాయిస్ ఆఫ్ ప్రజలు

# వాయిస్ టుడే

VOICE OF PRAJALU

TGTEL/25/A2649

తెలుగు దినపత్రిక

www.Voicetodaynews.com

https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 10

శనివారం, ఫిబ్రవరి 21, 2026

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## దక్షిణకొరియా మాజీ దేశాధ్యక్షుడికి జీవితకాల జైలుశిక్ష



సియోల్: దక్షిణకొరియా మాజీ దేశాధ్యక్షుడు యోన్ సుక్ యోల్‌కు జీవితకాల జైలుశిక్ష విధించారు. దేశంలో మార్షియల్ లా విధించే ప్రయత్నం చేసిన కేసులో ఆయనకు ఆ శిక్షను ఖరారు చేశారు. సైనిక బలగాలతో జాతీయ అసెంబ్లీని ముట్టడి చేసి, రాజకీయవేత్తల అరెస్టులకు ఆదేశాలు ఇచ్చారు. 2024 డిసెంబర్ 3న జరిగిన ఆ ఘటన కేసులో మాజీ అధ్యక్షుడు యోన్ సుక్ యోల్ కేసు ఎదుర్కొంటున్నారు. సియోల్ సెంట్రల్ డిస్ట్రిక్ట్ కోర్టులో జడ్జీ జీ గ్వా యోన్ తుది తీర్పు వినిపించారు. యోన్ సుక్ యోల్‌కు మరణశిక్ష విధించాలని ప్రాసిక్యూటర్లు కోరారు.

# ట్రంప్ టారిఫ్‌లు చట్టవిరుద్ధం



- ట్రంప్ విధించిన గ్లోబల్ టారిఫ్‌లలో చాలా వరకు చట్టవిరుద్ధమని సుప్రీం కోర్టు తీర్పు
- అధ్యక్షుడు తన అధికారాన్ని దుర్వినియోగం చేశారని 6-3 మెజారిటీతో స్పష్టం
- స్టీల్, అల్యూమినియం వంటి ప్రత్యేక టారిఫ్‌లకు ఈ తీర్పు వర్తించదు
- తీర్పుతో అమెరికా స్టాక్ మార్కెట్లు లాభాల్లోకి, ట్రేడ్ అనిశ్చితికి తెర
- ట్రంప్ రెండోసారి అధికారంలోకి వస్తే అనుసరించే ఆర్థిక విధానానికి ఇది పెద్ద దెబ్బ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆర్థిక విధానాలకు సుప్రీంకోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా పలు వాణిజ్య భాగస్వామ్య దేశాలపై ట్రంప్ విధించిన విస్తృత టారిఫ్‌లను (దిగుమతి సుంకాలు) అమెరికా సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం కొట్టివేసింది. 1977 నాటి అత్యవసర చట్టాన్ని అడ్డం పెట్టుకుని ఏకపక్షంగా టారిఫ్‌లు విధించే అధికారం అధ్యక్షుడికి లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు 6-3 మెజారిటీతో సంచలన తీర్పు




## ఢిల్లీ ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ నిరసన

- అమెరికాతో వాణిజ్య ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన
- ఇది సిగ్గులేని చర్యని బీజేపీ విమర్శ, రాజ్యాంగ హక్కని కాంగ్రెస్ సమర్థన
- రైతు ప్రయోజనాలపై రాజీపడలేదని స్పష్టం చేసిన కేంద్ర ప్రభుత్వం
- అంతర్జాతీయ ప్రముఖులు పాల్గొన్న సదస్సులో ఘటనపై రాజకీయ దుమారం

## నాలెడ్జ్, క్రియేటర్ ఎకానమీగా ఏపీ..




- ఢిల్లీ ఏఐ సమ్మిట్‌లో అడోబ్, ఆరామ్‌కో, ఎన్విడియా వంటి దిగ్గజాలతో సీఎం భేటీ
- ఏఐ లివింగ్ ల్యాబ్స్, డిజైన్ ఇంజనీరింగ్ కేంద్రాల ఏర్పాటుపై కీలక చర్చలు
- టెక్ నైపుణ్యాలున్న యువశక్తి రాష్ట్రానికి అతిపెద్ద వనరని స్పష్టం చేసిన చంద్రబాబు
- పాఠశాలల్లో రోబోటిక్స్, ఏఐ ల్యాబ్స్ ఏర్పాటుకు లెగో సంస్థతో సంప్రదింపులు

ఆంధ్రప్రదేశ్‌ను నాలెడ్జ్, క్రియేటర్ ఎకానమీకి కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలో కీలక చర్చలు జరిపారు. టెక్ నైపుణ్యాలున్న యువశక్తే రాష్ట్రానికి అతిపెద్ద వనరని, వారిని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటం టెక్నాలజీ వంటి భవిష్యత్ రంగాల్లో ప్రపంచస్థాయి నిపుణులుగా తీర్చిదిద్దుతామని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న 'ఇండియా ఏఐ-ఇంపాక్ట్ సమ్మిట్ 2026'లో భాగంగా పలు అంతర్జాతీయ టెక్ దిగ్గజ కంపెనీల అధినేతలతో ఆయన వేర్వేరుగా సమావేశమై రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే దిశగా చర్చలు జరిపారు.

మిగతా 2లో

## ఏఐ' ప్రత్యేక వార్ రూమ్ అవసరం..

- హైదరాబాద్ అనువైన ప్రదేశం: ఏఐ సదస్సులో రేవంత్ రెడ్డి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి వార్ రూమ్‌ను ఏర్పాటు చేయాలన్న ముఖ్యమంత్రి
- ఏఐలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలని ఆకాంక్ష
- జీఎస్టీ కౌన్సిల్‌లా ఏఐ కౌన్సిల్ ఏర్పాటు చేయాలన్న రేవంత్ రెడ్డి



మన దేశంలో కృత్రిమ మేధ (ఏఐ) అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ప్రత్యేక వార్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఏఐ పరిణామాలను పర్యవేక్షించడానికి, ఇతర అవసరాల కోసం వార్ రూమ్ అవసరమని, ఇలాంటి వార్ రూమ్ కోసం హైదరాబాద్ ఎంతో అనువైన ప్రదేశమని ఆయన అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న ఏఐ సదస్సు-2026 సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మనిషి కంటే కృత్రిమ మేధ (ఏఐ) ఎక్కువ తెలివితేటలు కలిగి ఉందని అన్నారు. ఏఐలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. హైదరాబాద్‌లో ఏఐ వర్సిటీని ఇప్పటికే అన్ని వసతులతో ఏర్పాటు చేశామని వెల్లడించారు. హైదరాబాద్ వంటి నగరంలో ప్రతి ఆరు నెలలకోసారి ఏఐకి సంబంధించిన సదస్సులు జరగాలని అన్నారు. జీఎస్టీ కౌన్సిల్ తరహా 'ఏఐ' కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు.

మిగతా 2లో

## కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డికి స్వల్ప అస్వస్థత

- నిమ్స్ ఆసుపత్రికి తరలించిన కుటుంబ సభ్యులు
- వాంతులు, విరేచనాల కారణంగా అస్వస్థత
- ఫుడ్ పాయిజన్ అయినట్లు చెబుతున్న కుటుంబ సభ్యులు

మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను వెంటనే హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వాంతులు, విరేచనాల కారణంగా అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది. ఆయనకు ఫుడ్ పాయిజన్ అయినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. నిమ్స్ వైద్యులు ఆయనకు చికిత్స అందిస్తున్నారు.

మిగతా 2లో



## సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో కీలక పరిణామం..

- ఛార్జ్‌షీట్ వెనక్కి పంపిన నాంపల్లి కోర్టు
- అల్లు అర్జున్ సహా 23 మందిపై పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు
- సాంకేతిక లోపాలను గుర్తించిన నాంపల్లి కోర్టు
- హార్డ్ డిస్క్‌లు, పెన్ డ్రైవ్‌లు, సీడీలను జత చేయకపోవడంతో వెనక్కి పంపిన కోర్టు

2లో

## చంద్రబాబును ఉద్దేశించి తాను ఏమీ అనలేదన్న అంబటి

- పెమ్మసాని 18 రోజులు సినిమా చూపించాడు..
- పారిపొమ్మని సీఐ చెప్పాడు: అంబటి రాంబాబు
- రాత్రి 2 గంటల సమయంలో పోలీసులు తనను కొట్టేందుకు యత్నించారని వెల్లడి
- తన ఇంటిపై దాడి చేసిన వారంతా కమ్మవారేనన్న అంబటి
- పెమ్మసాని మూల్యం చెల్లించాల్సిందేనని వ్యాఖ్య
- ముద్రగడను కోల్పోవడానికి సిద్ధంగా లేమన్న మాజీ మంత్రి

## కృష్ణమ్మ ఒడ్డున గోదావరి నేతలకు లోకేశ్ విందు...

- కూటమి ప్రజాప్రతినిధుల కోసం మంత్రి లోకేశ్ ఆత్మీయ విందులు
- రాజమండ్రి, నర్సాపురం నేతలకు ఉండవల్లిలో ఆతిథ్యం
- కుటుంబ సమేతంగా హాజరై సందడి చేసిన ఎమ్మెల్యేలు, ఎంపీలు
- మూడు పార్టీలు కాదు ఒకే కుటుంబమని చాటిచెప్పిన నేతలు
- మహిళలకు మంగళగిరి పట్టుచీరలను బహూకరించిన లోకేశ్



వాయిస్ టుడే
జనగాత్రం - మనసేత్రం
శనివారం, ఫిబ్రవరి 21, 2026

## ఏఐ' ప్రత్యేక వార్ రూమ్ అవసరం..

ఏఐ దుర్వినియోగం కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. హైదరాబాద్‌కు వచ్చి పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి టెక్ సంస్థలను కోరారు. ఏఐ రంగంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఏఐలో స్టార్టప్‌లను ప్రోత్సహించాలని అన్నారు. కృత్రిమ మేధను ఉపయోగించుకుంటే వ్యవసాయం సహా అన్ని రంగాలకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఏఐ మానవ జీవితాల్లో పెను మార్పులు తీసుకువస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. మనిషికి ఎన్నో పరిమితులు ఉండవచ్చని, అదే మనిషి సృష్టించిన ఏఐ ఫలితాలను మనం చూస్తూనే ఉన్నామని అన్నారు. గతంలో పారిశ్రామిక విప్లవం వచ్చిందని, ఇప్పుడు సాఫ్ట్‌వేర్ విప్లవం, ఏఐ శకం వచ్చిందని పేర్కొన్నారు. ప్రముఖ అంతర్జాతీయ కంపెనీలకు భారతీయులే సీఈవోలుగా ఉన్నారని గుర్తు చేశారు.

## ఢిల్లీ ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ నిరసన

ఢిల్లీలో జరుగుతున్న 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026'లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చేపట్టిన నిరసన తీవ్ర రాజకీయ దుమారం రేపింది. అమెరికాతో కేంద్ర ప్రభుత్వం కుదుర్చుకుంటున్నట్లుగా వార్తలు వస్తున్న వాణిజ్య ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ పలువురు యూత్ కాంగ్రెస్ నేతలు షర్ట్‌లు విప్పి ప్రదర్శన చేశారు. ఈ ఘటనతో కాంగ్రెస్, బీజేపీ మధ్య తీవ్రస్థాయిలో మాటల యుద్ధం మొదలైంది. ఈ నిరసనను కాంగ్రెస్ పార్టీ గట్టిగా సమర్థించుకుంది. "దేశంలోని యువత, రైతులు, వ్యాపారుల ఆగ్రహాన్ని యూత్ కాంగ్రెస్ సహచరులు తమ నిరసన రూపంలో వ్యక్తం చేశారు" అని 'ఎక్స్' సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. "అమెరికాతో వాణిజ్య ఒప్పందం చేసుకోవడం ద్వారా నరేంద్ర మోదీ మన యువత, రైతులు, వ్యాపారుల ప్రయోజనాలపై దాడి చేశారు. దేశాన్ని అమెరికాకు తాకట్టు పెట్టారు" అని తీవ్ర ఆరోపణలు చేసింది. నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిందని, ప్రజల గొంతుకను వినిపిస్తామని పేర్కొంది. కాంగ్రెస్ నిరసనపై బీజేపీ తీవ్రంగా మండిపడింది. అంతర్జాతీయ సదస్సుకు అంతరాయం కలిగించినందుకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. బీజేపీ ఎంపీ సంబిత్ పాత్రా ఈ నిరసనను "చొక్కాలు లేని, బుర్ర లేని, సిగ్గులేని చర్య"గా అభివర్ణించారు. ఇది దేశానికి అవమానకరమని, భారత్ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నమని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ విమర్శించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్, సుందర్ పిచాయ్ వంటి అంతర్జాతీయ ప్రముఖులు హాజరైన సదస్సులో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. ఈ వివాదంపై కేంద్ర ప్రభుత్వం స్పందిస్తూ, రైతు ప్రయోజనాలకే తమ తొలి ప్రాధాన్యత అని, ఈ విషయంలో ఎలాంటి రాజీ లేదని స్పష్టం చేసింది. ఒప్పందం పూర్తి వివరాలు వచ్చే నెలలో వెల్లడవుతాయని తెలిపింది. ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్న యూత్ కాంగ్రెస్ నాయకులు క్యూఆర్ కోడ్‌లతో భారత్ మండపంలోకి ప్రవేశించి ఈ నిరసన చేపట్టారు.

### కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డికి స్వల్ప అస్వస్థత

కాగా, ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల అంశంలో జీవన్ రెడ్డి పార్టీ రాష్ట్ర నాయకులపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. జగిత్యాలలో గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన సంజయ్ కుమార్ కాంగ్రెస్‌తో కలిసి ఉండటాన్ని జీవన్ రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారు. ఇటీవల జగిత్యాల మున్సిపాలిటీలో ఎప్పటి నుంచో పార్టీలో ఉన్న తన వర్గానికి 20 టిక్కెట్లు ఇచ్చి, సంజయ్ కుమార్ వర్గానికి 30 టిక్కెట్లు ఇచ్చారని ఆరోపించారు. ఫలితాలు వెలువడిన తర్వాత సంజయ్ కుమార్ వర్గానికి ఛైర్మన్ పదవిని ఇవ్వడం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

## సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో కీలక పరిణామం..

సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో మరోసారి కీలక పరిణామం చోటు చేసుకుంది. చిక్కడపల్లి పోలీసులు ఫైల్ చేసిన ఛార్జ్‌షీట్‌ను నాంపల్లి కోర్టు వెనక్కి పంపించింది. దీనిని వెనక్కి పంపించడం ఇది మూడోసారి కావడం గమనార్హం. ఈ కేసులో అల్లు అర్జున్ సహా 23 మందిపై పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. అయితే ఛార్జ్‌షీట్‌లో నాంపల్లి కోర్టు సాంకేతిక లోపాలను గుర్తించింది. ఎవిడెన్స్ మెటీరియల్ సమగ్రంగా లేదని, సాక్ష్యాలకు సంబంధించిన హార్డ్ డిస్క్‌లు, పెన్ డ్రైవ్‌లు, సీడీలను జతచేయకపోవడంతో కోర్టు ఛార్జ్‌షీట్‌ను వెనక్కి పంపించింది. ఎలాంటి లోపాలు లేకుండా ఫార్మాట్ ప్రకారం, ఛార్జ్‌షీట్‌లో పొందుపరిచిన అన్నింటికి ఆధారాలతో మరోసారి ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని చిక్కడపల్లి పోలీసులను నాంపల్లి కోర్టు ఆదేశించింది. గతంలో రెండుసార్లు కూడా ఛార్జ్‌షీట్‌లో సాంకేతిక కారణాలు చూపిస్తూ కోర్టు వెనక్కి పంపించింది.

## వైసీపీ ఎమ్మెల్సీ సవాల్ కు మంత్రి సుధారాణి కౌంటర్

ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో వైసీపీ సభ్యులు వెంకటేశ్వరస్వామి ఫొటోలు పట్టుకుని చెప్పులు, బూట్లతో ఆందోళన చేపట్టడంపై కూటమి నేతలు మండిపడుతున్నారు. ఈ క్రమంలో వైసీపీ ఎమ్మెల్సీ మాధవరావు సవాల్ విసిరారు. చెప్పులు, బూట్లు వేసుకుని దేవుడి ఫొటోతో సభలోకి వెళ్లినట్లు ఒక్క ఫొటో లేదా వీడియో చూపిస్తే ఎమ్మెల్సీగా రాజీనామా చేస్తానని ఛాలెంజ్ చేశారు. వెంటనే స్పందించిన మంత్రి సంధ్యారాణి వైసీపీ సభ్యులు చెప్పులతో ఉన్న వీడియోను బయటపెట్టారు. "స్వామి వారి ఫొటోలను ప్లకార్డుల తరహాలో వాడటం దుర్మార్గం. ఒకరు తలకిందులుగా పట్టుకున్నారు, ఇంకొకరు నిరసన అవ్వగానే టేబుల్‌పై పడేశారు. వీళ్లకు దేవుడంటే భయం, భక్తి లేవు. దేనికోసం డిమాండ్ చేస్తున్నారో వారికే తెలియని పరిస్థితి. వికృత చేష్టలతో స్వామివారిని అవమానించడం కలచివేస్తోంది" అని విమర్శించారు. మాధవరావు తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## ఏఐ సమ్మిట్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు చొక్కాలు విప్పడంపై పురందేశ్వరి ఫైర్

కాంగ్రెస్ పార్టీ తీరు దేశానికి తీవ్ర అవమానకరంగా ఉందని బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తీవ్రస్థాయిలో విమర్శించారు. భారత్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా గ్లోబల్ ఏఐ సమ్మిట్‌ను నిర్వహిస్తుంటే, కాంగ్రెస్ పార్టీ మాత్రం గందరగోళం సృష్టించిందని ఆమె మండిపడ్డారు. దేశ గౌరవాన్ని పక్కనపెట్టి, అంతర్జాతీయ వేదికపై భారత్‌ను అగౌరవపరిచేలా వ్యవహరించిందని ఆరోపించారు. ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ.. "భారత్ తన సాంకేతిక నాయకత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పే సమయంలో, రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ కార్యకర్తలు సమ్మిట్ వేదిక వద్ద చొక్కాలు విప్పి గందరగోళం సృష్టించారు. అంతర్జాతీయంగా మన దేశాన్ని అవమానించడానికే ఉద్దేశపూర్వకంగా ఈ చర్యకు పాల్పడ్డారు," అని పురందేశ్వరి పేర్కొన్నారు. భారత్ ఒక టెక్నాలజీ దిగ్గజంగా ఎదిగేందుకు కృషి చేస్తున్న తరుణంలో ఇలాంటి ప్రవర్తన దేశ పతనానికి దారితీస్తుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "రాజకీయ వ్యతిరేకత ఉండొచ్చు, కానీ దానికోసం దేశ ప్రతిష్ఠను ప్రపంచవ్యాప్తంగా దిగజార్చడం సరికాదు.

# అమెరికా సుప్రీంకోర్టు సంచలన తీర్పు



వెలువరించింది. ట్రంప్ కార్యనిర్వాహక అధికారాలకు కన్జర్వేటివ్ మెజారిటీ ఉన్న కోర్టు కళ్లెం వేయడం అరుదైన ఘటనగా విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. ఈ తీర్పుపై మెజారిటీ తరఫున అభిప్రాయాన్ని రాసిన ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్, అధ్యక్షుడి అధికారాల పరిధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. "అపరిమితమైన మొత్తంలో, కాలపరిమితి లేకుండా, విస్తృత స్థాయిలో ఏకపక్షంగా టారిఫ్‌లు విధించే అసాధారణ అధికారాన్ని అధ్యక్షుడు కోరుతున్నారు. రాజ్యాంగబద్ధంగా చూసినప్పుడు, అటువంటి అధికారాన్ని వినియోగించుకోవాలంటే కాంగ్రెస్ (అమెరికా పార్లమెంట్) నుంచి స్పష్టమైన అనుమతి ఉండాలి. కానీ, ట్రంప్ ఆధారపడిన 1977 చట్టానికి ఆ స్థాయి అధికారం లేదు" అని రాబర్ట్స్ తన తీర్పులో పేర్కొన్నారు. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం (ఐఈఈపీఏ) కింద అధ్యక్షుడికి అసాధారణ పరిస్థితుల్లో దిగుమతులను నియంత్రించే అధికారం మాత్రమే ఉందని, టారిఫ్‌లు విధించే అధికారం లేదని కోర్టు తేల్చి చెప్పింది. "ఆర్థిక లేదా విదేశీ వ్యవహారాల్లో మాకు ప్రత్యేక నైపుణ్యం ఉందని చెప్పడం లేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం మాకు కేటాయించిన పరిమిత పాత్రను మాత్రమే పోషిస్తున్నాం. ఆ పాత్రను నిర్వర్తిస్తూ, ఐఈఈపీఏ చట్టం అధ్యక్షుడికి టారిఫ్‌లు విధించే అధికారాన్ని ఇవ్వలేదని మేము స్పష్టం చేస్తున్నాం," అని జస్టిస్ రాబర్ట్స్ వివరించారు. ఫెంటానిల్, వాణిజ్య లోటు వంటి అంశాలను జాతీయ అత్యవసర పరిస్థితిగా ప్రకటించిన ట్రంప్, ఈ చట్టాన్ని అడ్డం పెట్టుకుని చైనా, మెక్సికో, కెనడా వంటి దేశాలపై భారీగా టారిఫ్‌లు విధించారు. ప్రపంచవ్యాప్తంగా డజన్ల కొద్దీ దేశాలపై ప్రతీకార టారిఫ్‌లు అమలు చేశారు. ఇందులో భాగంగానే భారత్‌పై 18 శాతం టారిఫ్ విధించారు. దాదాపు 50 ఏళ్ల చరిత్ర ఉన్న ఐఈఈపీఏ చట్టాన్ని టారిఫ్‌ల కోసం ఉపయోగించిన తొలి అధ్యక్షుడు ట్రంప్ కావడం గమనార్హం. అయితే, ఉక్కు, అల్యూమినియం, రాగి వంటి ఉత్పత్తులపై విధించిన రంగాల వారీ టారిఫ్‌లకు ఈ తీర్పు వర్తించదు. వాటిని వేరే చట్టాల కింద విధించడంతో అవి యథావిధిగా కొనసాగుతాయి. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో, ఇప్పటికే చెల్లించిన బిలియన్ల డాలర్ల టారిఫ్‌లను తిరిగి పొందేందుకు కంపెనీలు ప్రయత్నాలు ప్రారంభించే అవకాశం ఉంది. కాస్ట్‌కో, టయోటా గ్రూప్, రెవ్లాన్ వంటి వందలాది కంపెనీలు ఇప్పటికే ఈ విషయంపై న్యాయపోరాటం చేస్తున్నాయి. ఈ తీర్పు ట్రంప్ ప్రభుత్వానికి పెద్ద ఓటమి అయినప్పటికీ, టారిఫ్‌లు విధించే రాజ్యాంగబద్ధమైన అధికారం కాంగ్రెస్‌కు ఇప్పటికీ ఉంది.

# నాలెడ్జ్, క్రియేటర్ ఎకానమీగా ఏపీ..

ఏపీ పెవిలియన్‌లో అడోబ్ సీఈఓ శంతను నారాయణ్, ఆటోడెస్క్ ఏఐ హెడ్ మైక్ హాలే, ఆరామ్‌కో ఇండియా డైరెక్టర్ అబ్దుల్ రెహమాన్ ఐతుకైర్, లెగో ఎడ్యుకేషన్ వైస్ ప్రెసిడెంట్ టామ్ హాల్, ఆధార్ ఫౌండర్ సీటీఓ శ్రీకాంత్ నాదముని, ఖోస్లా వెంచర్స్ ఎండీ వినోద్ ఖోస్లా వంటి ప్రముఖులు ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. ప్రముఖ టెక్నాలజీ సంస్థ అడోబ్ సీఈఓ శంతను నారాయణ్‌తో భేటీ సందర్భంగా, ఏపీని నాలెడ్జ్ హబ్‌గా మార్చడమే తన లక్ష్యమని చంద్రబాబు వివరించారు. క్రియేటర్ ఎకానమీని పెద్ద ఎత్తున ప్రోత్సహించడానికి సహకారం అందించాలని కోరారు. ఇందుకు స్పందించిన శంతను నారాయణ్, విద్యార్థులు, నిపుణులకు నైపుణ్యాలు పెంచేందుకు ప్రత్యేకంగా క్రియేటర్ సాఫ్ట్‌వేర్‌ను అందిస్తామని హామీ ఇచ్చారు. ఏపీలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటు, పౌరసేవల డిజిటలైజేషన్ వంటి అంశాలపై కూడా ఇరువురి మధ్య ఫలప్రదమైన చర్చ జరిగింది. ప్రపంచ ఇంధన దిగ్గజం సౌదీ ఆరామ్‌కో ప్రతినిధులతో ముఖ్యమంత్రి జరిపిన చర్చల్లో ఏపీలో సౌర విద్యుత్‌తో సహా క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులపై దృష్టి సారించారు. గ్రీన్ ఎనర్జీ ఉత్పాదనకు రాష్ట్రం అత్యంత అనువైన ప్రాంతమని, ఇక్కడ కార్యకలాపాలు విస్తరించాలని ఆరామ్‌కోను ఆహ్వానించారు. ఏఐ చిప్‌ల తయారీలో అగ్రగామిగా ఉన్న ఎన్విడియా సంస్థ వైస్ ప్రెసిడెంట్ కాలిస్టా రెడ్‌మెండ్‌తో సీఎం భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



ఐఐటీ తిరుపతి, ఐఐఎస్ఈఆర్ తిరుపతి భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తున్న 'ఏపీ ఫస్ట్' ప్రాజెక్టులో పాలుపంచుకోవాలని కోరారు. ఆటోడెస్క్ సీఈఓ మైక్ హేలీతో మాట్లాడుతూ.. ఏపీలో డిజైన్ ఇంజనీరింగ్ సొల్యూషన్స్ కోసం ఒక గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ) అభివృద్ధి చేయాలని సూచించారు.

**పాఠశాల స్థాయి నుంచే టెక్నాలజీ విద్య**

పాఠశాల విద్యార్థులకు చిన్నతనం నుంచే టెక్నాలజీపై అవగాహన కల్పించేందుకు లెగో ఎడ్యుకేషన్ సంస్థ సహకారం అందించాలని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రంలోని పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ లెర్నింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ టామ్ హాల్‌ను కోరారు. విశాఖపట్నంలో 'లెగోల్యాండ్ కల్చరల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్' ఏర్పాటు చేయాలని కూడా ప్రతిపాదించారు. క్వాంటెలా ఇంక్ ఛైర్మన్ శ్రీధర్ గధితో సమావేశమై స్మార్ట్ గవర్నెన్స్, పౌరసేవల్లో ఏఐ సొల్యూషన్స్ వినియోగంపై చర్చించారు.

సమావేశాల అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు భారత్ మండపంలో ఏర్పాటు చేసిన ఏఐ సమ్మిట్‌లోని వివిధ స్టాళ్లను సందర్శించారు. ఎన్విడియా, టాటా, ఇంటెల్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు ఏర్పాటు చేసిన ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు. వ్యవసాయం, వైద్యం, పరిశ్రమల్లో ఏఐ వినియోగం ద్వారా వస్తున్న ఫలితాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టాటా సంస్థ ఏపీలో అమలు చేస్తున్న 'సంజీవని' (డిజిటల్ హెల్త్ రికార్డులు), డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను ప్రదర్శించింది. రోబోటిక్స్, ఏఐ ఆధారిత సేవల గురించి సీఎం ఆసక్తిగా తెలుసుకున్నారు. ఈ పర్యటన ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను టెక్నాలజీ, నాలెడ్జ్ ఎకానమీలో అగ్రగామిగా నిలపాలన్న తన దార్శనికతను చంద్రబాబు మరోసారి స్పష్టం చేశారు.

## చంద్రబాబును ఉద్దేశించి తాను ఏమీ అనలేదన్న అంబటి

మూడు కేసులకు సంబంధించి 18 రోజుల పాటు మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ మూడు కేసుల్లో బెయిల్ మంజూరు కావడంతో ఆయన జైలు నుంచి బయటకు వచ్చారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పై మండిపడ్డారు. "24 గంటల్లో సినిమా చూపిస్తానన్నావ్... 18 రోజులు సినిమా చూపించావు. ఇందులో ఎవరు హీరో? నేనే హీరో. మీరు విలన్లు అయ్యారు" అని అన్నారు.

**మీడియాతో మాట్లాడుతూ అంబటి చేసిన కీలక వ్యాఖ్యలు ఇవే:**

ఇరవై రోజులుగా ఎన్నో జరిగాయి. ఏం జరిగిందో ప్రజలు అర్థం చేసుకున్నారు.

జనవరి 31 అర్ధరాత్రి నల్లపాడు పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు బెయిల్ ఇవ్వడంతో మొన్న విడుదల అయ్యాను.

ఈ 18 రోజులు మాట్లాడే అవకాశమే రాలేదు. నా కూతురు అందరికీ అర్థమయ్యేలా అన్ని విషయాలు చెప్పింది.

టీడీపీ కట్టిన ఫ్లెక్సీ వద్దకు వెళ్లి మంచి పద్ధతి కాదని చెప్పే ప్రయత్నం చేశాను. ఫ్లెక్సీని నేను చించివేయలేదు.

మరుసటి రోజు గుళ్లలో పూజలు చెయ్యమని పార్టీ నుంచి సమాచారం వచ్చింది. పర్మిషన్ తీసుకుని అక్కడకు వెళ్లాను.

తిరిగి వస్తుంటే కారు అడ్డుకుని అమ్మ, అక్క అంటూ బూతులు తిట్టారు. ఆ తర్వాతే నేను కూడా తిట్టాను.

తర్వాత ఇంటికొచ్చి ఆలోచిస్తే నా అంతరాత్మ ఒప్పుకోలేదు. నేను అన్న మాటలు చంద్రబాబును ఉద్దేశించి కాదు. ఇంటికి వచ్చిన తర్వాత పశ్చాత్తాపానికి గురయ్యాను.

ఐదు గంటలకు ఇంటివద్దకు పలు నియోజకవర్గాల నుంచి భారీగా జనం వచ్చారు. నా కుటుంబ సభ్యులు, మనవళ్లు ఇంట్లో ఉన్నారు. ఏడు గంటలపాటు టీడీపీ గూండాలు రచ్చ చేశారు. ఇంటిపై దాడి చేసిన వారంతా కమ్మవారే. పోలీసుల అండతో రెచ్చిపోయారు. ఎక్కడైనా పోలీసులు, గూండాలు ఒక్కటవుతారా?

వైసీపీ వారిని మా ఇంటి వద్దకు రానివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు. పారిపోవాలని సీఐ గంగా వెంకటేశ్వర్లు నాతో చెప్పారు. పారిపోవడం కన్నా చచ్చిపోవడం మేలని నేను చెప్పాను.

పోలీసులు నన్ను తీసుకెళ్లి లాకప్ లో పెట్టారు. రాత్రి 2 గంటలకు స్టేషన్ పైకి తీసుకెళ్లి నన్ను కొట్టడానికి ప్రయత్నించారు. కానీ కొట్టలేదు. నన్ను కొట్టడానికి ప్రయత్నించడంపై న్యాయపోరాటం చేస్తా.

నల్లపాడు సీఐ వంశీ రిమాండ్ రిపోర్ట్ లో... "కమ్మ నా కొడకల్లారా" అని తిట్టానని రాశాడు. నా ఇద్దరు అల్లుళ్లు కమ్మవారే. కులాల పేరుతో రెచ్చగొడుతున్నది మీరే.

పెమ్మసాని చంద్రశేఖర్ మూల్యం చెల్లించే రోజు వస్తుంది. తప్పక మూల్యం చెల్లించాల్సిందే.

పోలీసులతో హత్యలు చేయించడం చంద్రబాబుకు అలవాటే. ఆ అలవాటు నారా లోకేశ్ కి వచ్చింది.

నేను కమ్మ వ్యతిరేకిని కాదు. నన్ను నిర్మూలించాలని రెడ్ బుక్ లో రాసుకున్నారట.

చంద్రబాబు కమ్మని ప్రభుత్వానికి పవన్ కల్యాణ్ కాపుకాస్తున్నాడు. వంగవీటి రంగాను కోల్పోయాం. ముద్రగడను కోల్పోవడానికి సిద్ధంగా లేము.

## కృష్ణమ్మ ఒడ్డున గోదావరి నేతలకు లోకేశ్ విందు...

రాజకీయాల్లో కుటుంబ విలువలకు, సంప్రదాయానికి పెద్దపీట వేస్తూ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కొత్త ఒరవడి సృష్టిస్తున్నారు. కూటమిలోని ప్రజాప్రతినిధుల కోసం ఆయన ఏర్పాటు చేస్తున్న ఆత్మీయ విందు సమావేశాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం నాడు... రాజమండ్రి, నర్సాపురం పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని ప్రజాప్రతినిధులకు ఘనంగా ఆతిథ్యమిచ్చారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల కోసం ఉండవల్లిలోని తన నివాసంలో కుటుంబసమేతంగా విందు ఏర్పాటు చేశారు. కృష్ణా నది ఒడ్డున ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమం వనభోజనాలను తలపించింది. గోదావరి జిల్లాల నుంచి వచ్చిన అతిథులకు లోకేశ్ దంపతులు ఘన స్వాగతం పలికి, మర్చిపోలేని ఆతిథ్యం ఇచ్చారు. పెద్దల మధ్య సంభాషణలు, పిల్లల ఆటపాటలు, మహిళల పలకరింపులతో ఆ ప్రాంగణమంతా సందడిగా మారింది. టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన నేతలంతా తమ కుటుంబాలతో హాజరై.. కూటమి అంటే మూడు పార్టీలు కాదని, అదొకటేనని చాటిచెప్పారు. ఈ సందర్భంగా నేతలు మంత్రి లోకేశ్ పై తమ అభిమానాన్ని చాటుకున్నారు. రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తనకు ఎంతో ఇష్టమైన రత్నం పెన్‌ను లోకేశ్ కు బహుమతిగా ఇచ్చారు. నర్సాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్.. లోకేశ్, బ్రాహ్మణి దంపతుల చిత్రాన్ని వస్త్రంపై ఎంతో కళాత్మకంగా ఎంబ్రాయిడరీ చేసి కానుకగా అందించారు. విందు అనంతరం మహిళలందరికీ లోకేశ్ దంపతులు మంగళగిరి పట్టుచీరలను బహూకరించారు. ఈ ఆత్మీయ విందుకు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేశ్, నిమ్మల రామానాయుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, పితాని సత్యనారాయణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఆరిమిల్లి రాధాకృష్ణ, పులపర్తి రామాంజనేయులు, బొమ్మిడి నాయకర్, బత్తుల బలరామకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్, మద్దిపాటి వెంకటరాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు తమ కుటుంబసభ్యులతో కలిసి హాజరయ్యారు.



# విజయవంతంగా ముగిసిన జాతీయ సదస్సు



వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : 'డిజైన్ ద్వారా నాణ్యత (క్యూబీడీ): ఫార్మాస్యూటికల్ పరిశోధనలో ప్రయోగాల రూపకల్పన (డీవోఈ)ను సమగ్రపరచడం' అనే అంశంపై గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ, హైదరాబాదులో నిర్వహించిన జాతీయ సదస్సు శుక్రవారం విజయవంతంగా ముగిసింది. ఔషధ ఆవిష్కరణ, సూత్రీకరణ అభివృద్ధి, విశ్లేషణాత్మక శాస్త్రాలు, నాణ్యత హామీ, నియంత్రణ శాస్త్రం వంటి ఔషధ పరిశోధన యొక్క బహుళ దశలలో ప్రయోగాల రూపకల్పన (డీవోఈ), అధునాతన గణాంక సాధనాల వినియోగాలపై మార్గనిర్దేశనం చేశారు. విద్యావేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణుల మధ్య అర్థవంతమైన చర్చలు, జ్ఞాన మార్పిడి కోసం ఈ వేదిక తోడ్పడింది.

న్యూహీట్ ఫార్మా టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు కీలకోపన్యాసం చేశారు. దీని తరువాత సౌరభ్ గుప్తా, 'క్యూబీడీ: ఫార్మా అభివృద్ధిలో ప్రమాద అంచనా, ప్రయోగాల రూపకల్పన, ఫార్మా అభివృద్ధిలో జీవితచక్ర నిర్వహణ'పై ప్రసంగించారు. 'ఔషధ అభివృద్ధి కోసం క్యూబీడీలో డీవోఈ ఒక ప్రధాన సాధనం' అనే అంశంపై ఏజీఎస్ ఫార్మా కన్సల్టింగ్ వ్యవస్థాపకుడు డాక్టర్ గౌతమ్ సమంత ఉపన్యసించారు. సదస్సు సారాంశాలతో రూపొందించిన పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. ఆ తరువాత ఆకర్షణీయమైన గోడ పత్రికల ప్రదర్శనను నిర్వహించారు. సదస్సు నిర్వాహకురాలు డాక్టర్ పూజా మిట్టల్ స్వాగత ప్రసంగం చేయగా, ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శివకుమార్ సదస్సు లక్ష్యాలను వివరించి, దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డాక్టర్ శ్రీకాంత్ గటాడి పాటతో ఆరంభమైన సదస్సు, డాక్టర్ బప్పాదిత్య ఛటర్జీ వందన సమర్పణతో ముగిసింది. కార్యక్రమాన్ని డాక్టర్ పవన్ కుమార్ చింతమనేని సమన్వయం చేశారు. ఈ సదస్సులో పాల్గొన్న వారందరికీ ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఆవిష్కరణ, నాణ్యతతో నడిచే ఔషధ పరిశోధన, పరిశ్రమ-విద్యా సహకారాన్ని ప్రోత్సహించడంలో గీతం నిబద్ధతను ఈ జాతీయ సదస్సు పునరుద్ఘాటించింది.



## ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ
## రూ.2 కోట్లతో ఉప్పల్ పాఠశాలలో భవన నిర్మాణం
### – అధికారులతో కలిసి స్థల పరిశీలన చేసిన పరమేశ్వర్ రెడ్డి


ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):- రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య బోధనతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు సీఎం రేవంత్ రెడ్డి పెద్ద పీట వేశారని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.2 కోట్ల నిధులతో చేపట్టనున్న పాఠశాల నిర్మాణ స్థలాన్ని పరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజితాపరమేశ్వర్ రెడ్డి, ఎంఈవో రామారావుతో కలిసి పరిశీలించారు. విద్యా రంగానికి సీఎం రేవంత్ రెడ్డి కావాల్సినన్ని నిధులను మంజూరు చేస్తూ పాఠశాలల భవనాలను నిర్మిస్తున్నట్టుగా ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోనూ ప్రభుత్వ పాఠశాలల్లో ఇదే తరహాలో భవనాలను నిర్మించేందుకు కృషి చేయనున్నట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రామారావు, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శిరీష మేడం సీనియర్ ఉపాధ్యాయులు అశోక్ డివిజన్ అధ్యక్షులు బకారం లక్ష్మణ్,ఈగ అంజయ్య, లింగంపల్లి రామకృష్ణ,హనుమంత్ రెడ్డి,బజారు జగన్నాథ్ గౌడ్,అమర్నాథ్,సోన్నెలా బాలరాజు,జీయగూడెం అబ్రహం,నర్సింగ్, తోకట రాజు,అలుగుల అనీల్ కుమార్, అల్వాల భాస్కర్,తోకట రాజు,జనగామ రామకృష్ణ,బకారం అరుణ్,విజయ్ కుమార్,సిల్వరు ప్రేమ్ కుమార్, నోముల సురేష్,సాయి రెడ్డి, భారత్, దేవరాజ్, మనోజ్, బాషా, సుధాకర్, ప్రకాష్, భాస్కర్, అజయ్, ప్రభాకర్, ప్రత్యుష్, క్రాంతి,సోన్నెలా అశ్విని,అంబికా, మల్లేశ్వరిఓనర్సమ్మ , సత్యమ్మ , హేమలత, గీత, లక్ష్మి, కిష్టమ్మా, మహేశ్వరి , కమలమ్మ, భాగ్యమ్మ , సరిత లక్ష్మమ్మ,,సంధ్యా, లలిత తదితరులు పాల్గొన్నారు.

## శివకుమార్‌కు
## మాతృభాష ప్రతిభ పురస్కారం ప్రదానం రేపు



హైదరాబాద్, ఫిబ్రవరి 20: వాయిస్ టుడే : నాగర్ కర్నూలు జిల్లా, వంగూరు మండలంలోని ప్రైమరీ హెల్త్ సెంటర్ (పి.హెచ్.సి, డీఈఓ)లో డాట ఎంట్రీ ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్న ఎ.శివకుమార్ మాతృ భాషా ప్రతిభ పురస్కారానికి ఎంపికయ్యారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఈ నెల 22న ఆదివారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్, చిక్కడపల్లి లోని త్యాగరాయ గానసభలో వివిధ రంగాల ప్రముఖులకు పురస్కారాల ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా నాగర్ కర్నూలు జిల్లా కల్వకుర్తి మండలం ఎల్లికల్ గ్రామానికి చెందిన ఎ.శివకుమార్ కరోనా సమయంలో ప్రజలకు తనవంతు గా విశేష సేవలందించినందుకు వారి సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేశామని సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్య క్రమానికి ఎమ్మెల్సీ సిరికొండ మధు సూదనాచారి ముఖ్య అతిథిగా పాల్గొని పురస్కారం బహూకరిస్తారని తెలిపారు. ఈ అవార్డుకు ఎంపిక కావడం పై పలువురు ప్రముఖులు, గ్రామస్తులు, పి.హెచ్.సి ఉద్యోగులు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

## అంగరంగ వైభవంగా రుద్రారం
## శ్రీ సీతారామ ఆంజనేయస్వామి 12వ వార్షికోత్సవం



వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో రుద్రారం శ్రీ సీతారామ ఆంజనేయస్వామి 12వ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించిన ఆలయ కమిటీ నిర్వాహకులు ఉదయం సీతారామాంజనేయ స్వామికి ప్రత్యేక అభిషేకము విశేషాలంకరణ నవగ్రహ పూజలు హోమాలు పూర్ణవతి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు శ్రీ సీతారామ ఆంజనేయ స్వామిని భారీ సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు అనంతరం అన్నదాతలు 24వ వార్డు కౌన్సిలర్ పెలిమేలి లతా వెంకటేష్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇస్నాపూర్ మున్సిపల్ చైర్మన్ సుమలత శ్రీకాంత్, కౌన్సిలర్ లత వెంకటేష్, మాజీ సర్పంచ్ సుధీర్ రెడ్డి గ్రామ నాయకులు బలరాం, రాజిరెడ్డి, గ్రామ పెద్దలు ప్రజలు మహిళలు భక్తులు శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..



## దైవ చింతనతోనే
## మానసిక ప్రశాంతత: నీలం మధు ముదిరాజ్
### పెద్ద శంకరంపేటలో ఘనంగా గంగమ్మ తల్లి విగ్రహావిష్కరణ

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : భక్తి మార్గం ద్వారానే మనిషికి సంపూర్ణ మానసిక ప్రశాంతత లభిస్తుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలం ఉత్తులూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గంగమ్మ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ.. గ్రామాలు ఆధ్యాత్మికంగా వెల్లివిరిసినప్పుడే ప్రజల మధ్య సోదరభావం పెంపొందుతుందని పేర్కొన్నారు. గంగమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, పాడిపంటలతో గ్రామలు సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నిరుడి శ్రావణిసాయిలు, మాజీ సర్పంచ్ మంద మల్లేష్, సతీష్, పెంటయ్య, దుర్గయ్య, బ్యతయ్య, చంద్రయ్య, సాయిలు, దశరథ్, సాయిలు, సంగయ్య, అశోక్, రాములు, పెంటన్న, ఈర గౌడ్, ఉత్సవ నిర్వహకులు, గ్రామ పెద్దలు,ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## అంతర్జాతీయ మాతృ భాష
## విశిష్ట సాహితీ ప్రతిభా పురస్కారం

ప్రముఖ జాతీయ కవి, రచయిత, అనువాదకుడు, భరత మాత గర్వించే తెలంగాణ ముద్దుబిడ్డ డా. పెరుక రాజు సాహిత్యంలో చేస్తున్న విశిష్ట కృషికి ప్రతిష్ఠాత్మకమైన విశిష్ట సాహితీ ప్రతిభా పురస్కారం 2026 సామాజిక చైతన్యంతో కూడిన శక్తివంతమైన కలంతో వివిధ భాషల్లో ఆయన చేస్తున్న అవిరళ విశిష్ట సాహిత్య సాగు ప్రతిభకు గుర్తింపుగా నేడు రవీంద్ర భారతి, భాగ్యనగరం తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ, జాతీయ తెలుగు సారస్వత పరిషత్, ఆదిలీల ఫౌండేషన్ న్యూఢిల్లీ తెలుగు భాషా చైతన్య సమితి సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవ ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారాన్ని ప్రధానం చేశారు. రాజు గేయం తెలుసుకో" అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో డా కేశరాజు రాంప్రసాద్, తెలుగు సారస్వత పరిషత్ అధ్యక్షులు, నిర్వాహకులు పి బడే సాబ్. డా ఆదినారాయణ, ఆదిలీల ఫౌండేషన్,న్యూఢిల్లీ అధ్యక్షులు బాల చారి తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ, కార్య దర్శి, పి.వృశీధ, రాధ కుసుమం సాహితీవేత్తలు, భాషా ప్రేమికులు,కవులు, యువకులు మరియు తదితరులు పాల్గొన్నారు.



## అనునిత్యం ప్రజా శ్రేయస్సు, నియోజకవర్గ
## అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్నాం
### బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 20(వాయిస్ టుడే): పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సంక్షేమ సంఘాల సభ్యులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, అభిమానులు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ కలిసి పలు ఆహ్వానాలు, వినతులు అందజేయగా సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... కుత్బుల్లాపూర్ ప్రజల శ్రేయస్సు, నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్నామని అన్నారు.



## పలు అభివృద్ధి పనులపై సీఎం సలహాదారులు
## మర్యదపూర్వకంగా కలిసిన కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 20(వాయిస్ టుడే ): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులు మరియు మౌలిక సదుపాయాల సమస్యల పరిష్కారం కొరకు ముఖ్యమంత్రి సలహాదారు (ప్రజా వ్యవహారాలు) వేం నరేందర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైనేజీ, పార్కుల అభివృద్ధి, తాగునీటి సరఫరా తదితర మౌలిక సమస్యలను ,ప్రజల ఇబ్బందులను సవివరంగా వివరించగా వేం నరేందర్ రెడ్డి సానుకూలంగా స్పందించి సంబంధిత పై అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు టి. లక్ష్మి రెడ్డి, రషీద్, సిద్దనోల్ల సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## "పర్వతాధిరోహకుడి"కి
## ఎమ్మెల్యే అభినందలు, శుభాశీస్సులు

కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 20(వాయిస్ టుడే): పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బౌరంపేట్ కు చెందిన యువకుడు, పర్వతాధిరోహకుడి పల్పునూరి తులసీ రెడ్డి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మర్యాద పూర్వకంగా కలిసి ఈ సంవత్సరం ఏప్రిల్ లో చేపట్టనున్న ఎవరెస్ట్ శిఖర అధిరోహణ వివరాలు తెలియజేయగా ఎమ్మెల్యే పల్పునూరి తులసీరెడ్డిని అభినందించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... అత్యున్నత శిక్షణ పొందుతూ పర్వతాధిరోహణలో ఎన్నో విజయాలు సాధించిన తులసి రెడ్డి రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధించి కుత్బుల్లాపూర్ కు మరింత పేరు తేవాలన్నారు. పర్వతాధిరోహణలో మంచి పేరు గడుస్తున్న తులసి రెడ్డికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత మెగా ఆరోగ్య రక్తదాన శిబిరం

**మీ ఆరోగ్యమే మా ప్రాధాన్యత**

**మీ ఆరోగ్యాన్ని కాపాడుకోండి ఒక రక్తదానం ద్వారా ఒక ప్రాణాన్ని కాపాడండి**




కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 20(వాయిస్ టుడే ) 22 ఆదివారం శోదయా కాలనీ కమ్యూనిటీ హాల్లో నేతాజీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డేగల సతీష్ బాబు వారి మిత్రబృందం ఆధ్వర్యంలో మెగా హెల్త్ అండ్ బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించబడుతుంది ఆదివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత వైద్య పరీక్షలు,ఎక్స్పర్ట్ డాక్టర్స్ నిపుణుల సలహాలు అందుబాటులో ఉంటాయి.అదేవిధంగా ఈ క్యాంపులో వివిధ రకాల టెస్టులు చేయబడతాయి అందులో ఈ వైద్య విభాగాల పరీక్షలు నిర్వహించబడును దాంట్లో భాగంగా బీపీ షుగర్ గుండె సంబంధిత సమస్యలు అంటే హార్ట్ సమస్యలు నరాల సమస్యలు మూత్ర సంబంధిత సమస్యలు ఎముకలు అంటే బోన్స్ సమస్యలు క్యాన్సర్ పరీక్షలు కంటి పరీక్షలు మహిళల ఆరోగ్య సమస్యలు పిల్లలు ఆరోగ్య సమస్యలు పంటికి పరీక్షలు మరియు అదే విధంగా హార్ట్ కు సంబంధించిన టెస్టులు ఎకో, ఈసీజీ,మొదలగునవి చేయబడతాయి అదేవిధంగా ఈ కార్యక్రమంలో భాగంగా బ్లడ్ డొనేషన్ క్యాంపు కూడా నిర్వహించబడుతుంది అది చిరంజీవి బ్లడ్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో ఒక 300 మందికి బ్లడ్ డొనేషన్ క్యాంపు కూడా నిర్వహించడం జరుగుతుంది 300 మంది యువకులు ముందుకు వచ్చి ఈ బ్లడ్ కార్యక్రమాన్ని గొప్పగా నిర్వహిస్తున్నారు దానికి 18 నుండి 65 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు రక్తదానం చేసి అవసరమైన వారికి ప్రాణదానం చేయగలరని చెప్పి కోరుకుంటున్నాము అదేవిధంగా రక్తదానం మహాదానం మీ యొక్క యూనిట్ రక్తం ఎవరికో ఒక మనిషికి కొత్త జీవితాన్ని అందిస్తుంది.ఈ మెగా క్యాంప్ చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో అదే విధంగా హైదరాబాదులో టాప్ కార్పొరేట్ హాస్పిటల్స్ వారు వచ్చి సేవలందిస్తున్నారు అది కిమ్స్ సంక్షేమ హాస్పిటల్ కామినేని హాస్పిటల్స్ కేర్ హాస్పిటల్ వెల్నెస్ హాస్పిటల్,ఈ ప్రోగ్రాం రాజు ఎంటర్టైన్ వారి సౌజన్యంతో ఘనంగా నిర్వహించబడుతుంది అదేవిధంగా మీరు మీ కుటుంబ సమేతంగా విచ్చేసి ఈ ఆరోగ్య పరీక్షల సేవా కార్యక్రమాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరుకుంటున్నాం.

# గద్వాల్ జిల్లా అలంపూర్ నుంచి జనసేనలోకి భారీ వలసలు

**– ఉద్యమకారుడు తుమ్మల రవికుమార్‌తో పాటు పలువురు యువకుల ఘన చేరిక....**



కూకట్‌పల్లి, ఫిబ్రవరి 20(వాయిస్ టుడే): తెలంగాణ రాజకీయాల్లో జనసేన పార్టీ బలోపేతానికి మరొక కీలక అడుగు పడింది. గద్వాల్ జిల్లా అలంపూర్ నియోజకవర్గం నుండి పలువురు నాయకులు, యువకులు భారీ సంఖ్యలో జనసేన పార్టీలో చేరారు. కూకట్పల్లి జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమం ఉత్సాహ భరిత వాతావరణంలో సాగింది. ఈ చేరికల కార్యక్రమం తెలంగాణ జనసేన పార్టీ రాష్ట్ర ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ్, కూకట్ పల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మరియు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కో–ఆర్డినేటర్ ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ చేతుల మీదుగా జరిగింది. రాష్ట్ర నాయకురాలు మండపాక కావ్య, నియోజకవర్గ నాయకులు మహేష్ నాయుడు, బోయ జమ్మన్న ఆధ్వర్యంలో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీఆర్‌ఎస్ ఉద్యమకారుడిగా పేరుగాంచిన తుమ్మల రవికుమార్‌తో పాటు ప్రకాష్ గౌడ్, ఎస్. రాజేష్, కె. వర్మ చారి, ఎస్. మురారి, కె. సోమేశ్, పవన్, బాలు, లాల్ నాయుడు, బి. చిన్న మద్దిలేటి, భాస్కర్ నాయుడు, జగన్, జన్మేశ్, నరసింహ, నరేష్, తిరుపాల్ గౌడ్, రామకృష్ణ, సంజు రెడ్డి, యాసిన్ తదితరులు పార్టీ కండువాలు కప్పుకొని జనసేనలో చేరారు. జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలు, పారదర్శక రాజకీయాల పట్ల నిబద్ధత, యువతకు ప్రాధాన్యత ఇచ్చే విధానాలు తమను ఆకర్షించాయని చేరిన నాయకులు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జనసేన వేదికగా సేవ చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణలో జనసేన పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని, రానున్న రోజుల్లో మరిన్ని వలసలు చోటుచేసుకుంటాయని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమం, యువత సాధికారత, పారదర్శక పాలన లక్ష్యాల సాధన కోసం ప్రతి జనసైనికుడు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర యువ నాయకులు యడమ రాజేష్, జిహెచ్ఎంసీ అడ్హాక్ కమిటీ సభ్యులు కొల్లా శంకర్, స్టూడెంట్ వింగ్ అడ్హాక్ కమిటీ సభ్యులు సూర్య తోరం, మహేష్, బాడిత పవన్, రత్న సాయి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. జనసైనికుల నినాదాలతో కార్యాలయం మార్మోగింది. ఈ భారీ చేరికలతో అలంపూర్ నియోజక వర్గంలో జనసేన పార్టీకి మరింత బలం చేకూరిందని పార్టీ శ్రేణులు అభిప్రాయపడ్డాయి.



## అఫ్జల్‌గంజ్ ఇన్స్ పెక్టర్ మోహన్ రావుకు సత్కారం

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (వాయిస్ టుడే) : అఫ్జల్‌గంజ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా కె. మోహన్ రావు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుక్రవారం బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ ఆర్ లక్ష్మణ్ రావు నేతృత్వంలో పలువురు ప్రముఖులు ఇన్ స్పెక్టర్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్ స్పెక్టర్ మోహన్ రావు ను శాలువాతో సత్కరించి పూల బొకే అందజేసి లక్ష్మణ్ రావు అభినందించారు. ఇన్ స్పెక్టర్ నేతృత్వంలో అఫ్జల్‌గంజ్ ప్రాంతంలో శాంతిభద్రతలు మరింత బలోపేతం అవుతాయని మరియు ప్రజా భద్రత అత్యంత ప్రాధాన్యతగా ఉంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బజరంగ్ సేన సభ్యులు మరియు స్థానిక శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.



## "మేధస్సుకు పదును పెట్టేలా మండల సైన్స్ టాలెంట్ టెస్ట్ "

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట: ఫిబ్రవరి 19 న జాతీయ సైన్స్ డే కార్యక్రమంలో భాగంగా ఎఫ్ పి ఎస్ టి ఆధ్వర్యంలో మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ను పిఎం శ్రీ జిల్లా పరిషత్ (బాలురు) యాదగిరిగుట్టలో గురువారం రోజున నిర్వహించడం జరిగిందని ఎఫ్ పి ఎస్ టి మండల కన్వీనర్ చింతోజు శ్రవణ్ కుమార్ ,కో కన్వీనర్ లక్కీ రెడ్డి శ్రీనివాస్ రెడ్డిలు తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8 , 9 తరగతులు చదువుతున్న విద్యార్థులలో తరగతికి ఒకరు చొప్పున టెస్టులో పాల్గొనేటట్లు అవకాశం కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట మండల విద్యాశాఖాధికారిగా శ్రీమతి కే శరత్ యామిని మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరులు పెంపొందించడానికి ,హేతువాద దృక్పథం పెంచడానికి, ప్రపంచంతో పోటీపడేలా చేస్తూ విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణానికి ఇలాంటి పరీక్షలు ఎంతో దోహదపడతాయని, విద్యార్థుల్ని ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయుల కృషిని అభినందించారు. మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ విజేతలుగా నిలిచిన జడ్పీహెచ్ఎస్ మాసాయిపేట విద్యార్థులు ఎస్కే ఇస్మాయిల్, ఎస్కే అఫ్రీన్లకు బహుమతులు అందజేయడం జరిగింది. గైడ్ టీచర్ మాధవి మేడంను, విద్యార్థులను అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రధాన భూమిక నిర్వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంఈఓ కే శరత్ యామిని, చింతోజు శ్రవణ్ కుమార్, ఎన్. ఉదయశ్రీ, బి.బాలరాజ్, లక్కీ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బీబీ.మాధవి, సత్యపాల్ రెడ్డి, పి.వెంకట్ కృష్ణ, వై.నరేష్, సుదర్శన్, సత్యనారాయణ తదితర ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.




## 2026 నాటికి ఎయిమ్స్ పనులు పూర్తి కావాలి

**– భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**

**నిర్మాణ జాప్యంపై కాంట్రాక్టర్లు, కన్సల్టెంట్లపై సీరియస్ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**

**25% ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని డిమాండ్ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో... (వాయిస్ టుడే ప్రతినిధి):– బిబినగర్ ఎయిమ్స్ ఆస్పత్రి సేవలు 2026 నాటికి సంపూర్ణంగా ప్రజలకు అందుబాటులోకి రావాలని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఎయిమ్స్ ప్రాంగణంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి భవన నిర్మాణాల్లో జరుగుతున్న జాప్యంపై ఎంపీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ?ఇప్పటికే భవన నిర్మాణాలు రెండు ఏళ్లు ఆలస్యమయ్యాయని, ఇంకా ఎంతకాలం సాగదీస్తారని కాంట్రాక్టర్లను, కన్సల్టెంట్లను ఎంపీ నిలదీశారు. నిర్ణీత క్యాలెండర్ ప్రకారం పనులు పూర్తి చేసి అప్పగించాలని స్పష్టం చేశారు. నిర్మాణ వేగాన్ని పెంచేందుకు అదనపు సిబ్బందిని నియమించాలని, రాత్రింబవళ్లు పనులు చేసి గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ?స్థానిక రోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వైద్య సేవలు విస్తరించాలని ఆయన సూచించారు.

ప్రస్తుతం ఉన్న రెండు డయాలసిస్ మిషన్లు సరిపోవని, తక్షణమే మరో 25 కొత్త డయాలసిస్ మిషన్లను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆస్పత్రికి అవసరమైన వైద్య పరికరాలు, మౌలిక వసతులపై సమగ్ర రిపోర్టు అందజేయాలని అధికారులను కోరారు. ?ఎయిమ్స్ ఉద్యోగ నియామకాలపై ఎంపీ చామల కీలక వ్యాఖ్యలు చేశారు. "ఎయిమ్స్‌లో జరిగే ఉద్యోగ నియామకాల్లో 25 శాతం కోటాను ఖచ్చితంగా స్థానికులకే కేటాయించాలి" అని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు రాజీ పడేది లేదని స్పష్టం చేశారు.



## మాజీ మంత్రి హరీశ్ రావు మున్సిపల్ విజేతల ఘన సన్మానం కార్యక్రమం

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : పటాన్‌చెరు నియోజకవర్గం రామచంద్రాపురంలోని బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి నివాసంలో ఘనంగా సన్మానం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మాజీ మంత్రి హరీశ్ రావు సాన్నిధ్యంలో, ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన ఐదు మున్సిపాలిటీల బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జీలు, చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లు మరియు ఎన్నికైన కౌన్సిలర్లందరినీ ఘనంగా సన్మానించడం జరిగింది.

ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించిన విజయం పార్టీపై ప్రజల విశ్వాసానికి నిదర్శనమని తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, పారిశుధ్యం, తాగునీరు, రహదారుల అభివృద్ధి వంటి అంశాల్లో ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ, ఈ విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

ఎన్నికల్లో అహర్నిశలు కృషి చేసిన మున్సిపాలిటీ ఇన్‌చార్జులు మరియు సీనియర్ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**ఇంద్రేశం మున్సిపాలిటీ ఇన్‌చార్జులు:** గోసుల శ్రీనివాస్ యాదవ్, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్.

**గుమ్మడిదల మున్సిపాలిటీ ఇన్‌చార్జులు:** పట్నం మాణిక్యం, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గోవర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ తోంట అంజయ్య యాదవ్.

**గడ్డపోతారం మున్సిపాలిటీ ఇన్‌చార్జులు:**

ఎంఎల్సీ శంభిపూర్ రాజు, జిన్నారం మాజీ జెడ్పీటీసీ బాలు రెడ్డి, కాటా రాజు .

**ఇస్నాపూర్ మున్సిపాలిటీ ఇన్‌చార్జులు:**

తెలంగాణ మాజీ ఎస్సీ/ఎస్టీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమి రెడ్డి, మాజీ ఎంపీటీసీ కుమార్ గౌడ్, విష్ణు వర్ధన్, పృథ్వీ రాజ్ , చంద్రశేఖర్ రెడ్డి గారు, సంపత్,

**జిన్నారం మున్సిపాలిటీ ఇన్‌చార్జులు:**

పాల సాయిరాం గారు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, అమీన్పూర్ ఎక్స్ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, మాణిక్ యాదవ్. వారితో పాటు గుమ్మడిదల మండల అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి ,జిన్నారం మండల అధ్యక్షులు రాజేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమార్ గౌడ్, జగన్నాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కింగ్‌స్టన్ ఆస్పత్రి 4వ వార్షికోత్సవ వేడుకలు

**ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ సంపూర్ణ ఆరోగ్యం పొందాలి**

**రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి అజారుద్దీన్**




హైదరాబాద్, ఫిబ్రవరి 20: వాయిస్ టుడే : ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పై అవగాహన పెంపొందించుకొని ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలని రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి అజరుద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం మాసబ్ ట్యాంక్ లోని కింగ్ స్టన్ ఆస్పత్రి 4వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా.. 'ఊపిరితిత్తుల ఆరోగ్యం –సంరక్షణ – నివారణ' పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తారేక్ అన్సారి, డాక్టర్ ఆశిష్ చౌహాన్, క్రిటికల్ కేర్ స్పెషలిస్టు, మెడికల్ డైరెక్టర్, డాక్టర్ మహమ్మద్ ఫైసల్, రెవరెండ్ బ్రదర్ జాన్, ప్రఖ్యాత ఆర్థికవేత్త, డాక్టర్ అమీరుల్లా తదితరులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి అజరుద్దీన్ మాట్లాడుతూ.. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు, వాటి వల్ల శరీరంలో ఇతర అవయవాలకు పొంచి ఉన్న ప్రమాదాలపై రోగులకు అవగాహన కల్పించేందుకు కింగ్ స్టన్ ఆస్పత్రి ముందుకు రావడం సంతోషకర విషయమని అన్నారు. ప్రతి ఒక్కరూ నిజజీవితంలో తమ శరీరంలో అత్యంత కీలకమైన సున్నితమైన ఊపిరితిత్తులను నిర్లక్ష్యం చేయకుండా, తమకు తామే సంరక్షించుకోవాలని ఆయన సూచించారు. శారీరక శ్రమతో పాటు ప్రతి ఒక్కరూ, ప్రతిరోజు సుమారు అరగంట పాటు వ్యాయామం చేయాలని ఆయన తెలిపారు. అనంతరం,, కింగ్స్టన్ ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్, డాక్టర్ మహ్మద్ ఫైసల్ మాట్లాడుతూ,,,, తమ ఆసుపత్రి ఆధ్వర్యంలో, కమ్యూనిటీ స్క్రీనింగ్ క్యాంపులు, సిపిఆర్ పై శిక్షణ, వర్క్ షాపులు, పాఠశాల కళాశాల విద్యార్థులకు, ఊపిరితిత్తుల సంరక్షణ పైన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు, తమ ఆసుపత్రి 4, వ వార్షికోత్సవం సందర్భంగా ఊపిరితిత్తుల ఇన్స్ పైర్ కార్యక్రమం నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

# కాంగ్రెస్ పార్టీకికి ఆంటీ డిఫెక్షన్‌పైన డిస్క్వాలిఫికేషన్‌పైన మాట్లాడే నైతిక అర్హత ఉందా?

పటాన్ చెరు (వాయిస్ టుడే న్యూస్) : 10 మంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీకి ద్రోహం చేసి కాంగ్రెస్లో చేరితే ప్రజాక్షేత్రంలో ప్రత్యక్షమైన ఆధారాలు ఉన్నా కూడా వాళ్ల పార్టీ మారలేదు అని అసెంబ్లీ స్పీకర్ తన పదవిని అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ వాళ్ళని డిస్క్వాలిఫై చేయలేదు. మరి అటువంటి అప్పుడు ఒక కౌన్సిలర్ విషయంలో ఏ విధంగా డిస్ క్వాలిఫై చేయమని అడుగుతారు? ఇది దయ్యాలు వేదాలు వర్ణించినట్టు కాదా?

ఇదే మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో అనైతిక పద్ధతిలో గెలిచిన కాంగ్రెస్ పార్టీ నైతికత గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది

వాట్సాప్ మెసేజ్ ఆధారంగా ప్రజా ప్రతినిధి హక్కులు రద్దు చేయలేరు

మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికలో పార్టీ విప్ ఉల్లంఘన జరిగినట్లు వచ్చిన ప్రెస్ నోట్ పై కొన్ని ముఖ్యమైన చట్టపరమైన అంశాలు ప్రజల ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

ఒక ఎన్నికైన ప్రజా ప్రతినిధిని డిస్క్వాలిఫై చేయడం అనేది సాధారణ రాజకీయ చర్య కాదు. అది ప్రజలు ఇచ్చిన ప్రజాస్వామ్య మాండేటును రద్దు చేసే తీవ్రమైన చట్టపరమైన పరిణామం. అలాంటి చర్య తెలంగాణ మున్సిపాలిటీస్ చట్టం, 2019 మరియు సహజ న్యాయ సూత్రాలకు పూర్తిగా అనుగుణంగా ఉండాలి.

"వాట్సాప్‌లో విప్ పంపాం, బ్లూ టిక్స్ కనిపిస్తున్నాయి"



అనే మాట ఒక్కటే చట్టబద్ధమైన సర్వీస్‌గా పరిగణించబడదు.

డిస్క్వాలిఫికేషన్ నిలబడాలంటే స్పష్టంగా నిరూపించాల్సింది:

విప్ చట్టబద్ధంగా అధికారం ఉన్న వ్యక్తి ద్వారా జారీ చేయబడిందా అది సరైన విధంగా, చట్టబద్ధంగా తెలియజేయబడిందా కావాలనే, తెలుసుకొని ఉల్లంఘన జరిగిందా.. చట్టంలో పేర్కొన్న విధానాలన్నీ కచ్చితంగా పాటించబడాయా

వాట్సాప్ స్క్రీన్‌షాట్లు వంటి ఎలక్ట్రానిక్ ఆధారాలకు భారత సాక్ష్యాధార చట్టం సెక్షన్ 65బీ ప్రకారం సరైన సర్టిఫికేషన్ అవసరం. కఠినమైన ప్రమాణాలు లేకుండా అలాంటి ఆధారాలు బలహీనంగా ఉంటాయి.

ఆంటీ–డిఫెక్షన్ నిబంధనలు శిక్షాత్మక స్వభావం కలిగినవి. ప్రజా మాండేటు ప్రమాదంలో ఉన్నప్పుడు, నిరూపణ భారం ఫిర్యాదు చేసిన వారి పైనే ఉంటుంది. ఏ సందేహం వచ్చినా అది ఎన్నికైన ప్రతినిధి ప్రయోజనానికే ఉపయోగపడాలి.

ఇది ఏ పార్టీకి మద్దతు ఇవ్వడం గాని, వ్యతిరేకించడం గాని కాదు. ఇది:

చట్ట పరిపాలన
న్యాయ ప్రక్రియ
ఆధారాల ప్రమాణాలు
ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ

ఈ విషయం చట్టం మరియు ఆధారాల ఆధారంగా మాత్రమే నిర్ణయించబడాలి, ప్రెస్ ప్రకటనల ఆధారంగా కాదు. రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో విధానం (జూతీశీఛవ–ఎబతీవ) అనేది సాంకేతిక అంశం కాదు. అది ప్రజల సంకల్పానికి రక్షణ కవచం.

ఒక అడ్వకేట్ ఉ రాజ్యాంగ కార్యకర్తగా, ఒక రాజకీయ నాయకుడిగా ఈ విషయాన్ని ప్రజాముకంగా ప్రస్తావిస్తున్నాను.



## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సర్ధార్ రవీందర్ సింగ్

### ఆడబిడ్డ పెళ్లికి 25,000 వేల నగదు అందజేత

కరీంనగర్, ఫిబ్రవరి 20(వాయిస్ టుడే): కార్పొరేషన్ ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని కార్యరూపంలోకి తీసుకువచ్చిన ఘనత 58వ డివిజన్ కార్పొరేటర్, కరీంనగర్ మాజీ మేయర్,రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్ధార్ రవీందర్ సింగ్ మరోసారి మాట నిలబెట్టుకున్న నాయకుడిగా నిలిచారు.కరీంనగర్ నగరంలోని 58వ డివిజన్‌కు చెందిన మాడిశెట్టి రవీందర్--నిర్మల దంపతుల కుమార్తె అక్షిత వివాహ మహోత్సవం ఘనంగా జరిగింది.ఈ వేడుకకు స్వయంగా హాజరైన సర్ధార్ రవీందర్ సింగ్, ఎన్నికల ప్రచారం సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.25,000 నగదును ఆడబిడ్డకు కట్నం కింద అందజేశారు.కుటుంబ సభ్యులను అభినందిస్తూ నూతన వధూవరులకు ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల విశ్వాసమే తనకు అతిపెద్ద బలం అని పేర్కొన్నారు.నగర ప్రజలు తన మీద నమ్మకంతో వరుసగా ఆరు సార్లు కార్పొరేటర్ గా గెలిపించారని గుర్తుచేశారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి మాట తనకు బాధ్యతగా భావిస్తానని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తన ధ్యేయమని తెలిపారు. సమాజంలోని ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలిచి, అవసరమైన చోట సహాయం అందించడం ప్రజాప్రతినిధిగా తన కర్తవ్యమని స్పష్టం చేశారు.స్థానికులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని మరచిపోకుండా అమలు చేయడం అభినందనీయమని అన్నారు. వివాహ వేడుకలో పాల్గొన్న ప్రజలు, నాయకులు ఆయన సేవా తత్పరతను ప్రశంసించారు.ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలు, సామాజిక బాధ్యతల నిర్వర్తనలో ముందుండే నాయకుడిగా సర్ధార్ రవీందర్ సింగ్ పేరు మరొకసారి ప్రతిష్టాత్మకంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.



## ఆదరిస్తే మరింత అభివృద్ధి

### మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

తిమ్మాపూర్,ఫిబ్రవరి 20(వాయిస్ టుడే):జనహితమే లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆదరిస్తే ప్రజలు మరింత పురోభివృద్ధి సాధిస్తారని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ లో తిమ్మాపూర్ మండలానికి చెందిన 57 మందికి సీఎంఆర్ఎఫ్,67 మందికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం,అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించి ఆశీర్వదించాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికే వివిధ వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక పథకాలను అమలు చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.వివిధ పథకాల ద్వారా లబ్ధిపొందుతున్న ప్రజలు ప్రభుత్వాన్ని అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.అలాంటప్పుడే ప్రభుత్వం మరిన్ని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టే వీలుంటుందన్నారు.ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 23వ విడుతలో తిమ్మాపూర్ మండలానికి చెందిన 57 మంది లబ్ధిదారులకు 15,78,500 రూపాయలు మంజూరు కాగా,వాటిని చెక్కుల రూపంలో అందిస్తున్నట్టు తెలిపారు.అలాగే 67 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్ కింద 67,08,772 రూపాయ ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు.గతంలో మాదిరిగా సీఎంఆర్ఎఫ్, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ ఆర్థిక సహాయాల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వంలో లేదన్నారు.ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేసిందన్నారు.ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల తహసీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్,మాజీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి,మాజీ కార్పొరేటర్ సల్ల రవీందర్, పార్టీ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు,గసికంటి లక్ష్మారెడ్డి, మామిడి అనిల్ కుమార్, గోగూరి నర్సింహారెడ్డి, ఎస్.కొండల్ రావు,కొత్త తిరుపతిరెడ్డి, చింతల లక్ష్మారెడ్డి,గొట్టెముక్కుల సంపత్ రెడ్డి,గుంటి మల్లేశం,ఎలుక రాజు, తమ్మనవేణి రాములు యాదవ్,శ్రీనివాస్ గౌడ్,పోలు రాము, రమేశ్,వినోద్,మామిడి అనిల్, రెవెన్యూ ఇన్ స్పెక్టర్ రవీందర్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది జ్యోతి, రమేశ్, అనిల్,కొమురయ్య పాల్గొన్నారు.



## గంగాధర క్రికెట్ టీమ్ కు టీషర్ట్స్ స్పాన్సర్స్ చేసిన ఉప్పు ప్రశాంత్, కోల అనిల్ కుమార్

గంగాధర, ఫిబ్రవరి 20(వాయిస్ టుడే) మండల కేంద్రంలో గత పదిహేను రోజుల నుండి ఎడ్ల అనిల్ ఆధ్వర్యంలో జరుగుతున్న కేసీఆర్ కప్ క్రికెట్ టోర్నమెంట్ లో దాదాపు 80 జట్లు పాల్గొన్నాయి.రెండవ రౌండ్ మ్యాచ్ లు ప్రారంభంతో టోర్నమెంట్ లో గంగాధర క్రికెట్ జట్టుకు ఉప్పు ప్రశాంత్,కోల అనిల్ టీషర్ట్స్ స్పాన్సర్స్ చేశారు.వారికి గంగాధర క్రికెట్ అసోసియేషన్ ద్వారా ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ ప్రోగ్రాంలో యువ నాయకుడు ఠాగూర్, వివేక్, ఉపేందర్, నరేష్, కరుణాకర్,హేమంత్, విష్ణు, విజయ్,శ్రీనువాస్,ప్రదీప్ మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.

# సదరం క్యాంపును పరిశీలించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఫిబ్రవరి 20: కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిర్వహిస్తున్న దివ్యాంగుల వైకల్యం నిర్ధారణ సదరం క్యాంపును శుక్రవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన పరిశీలించారు. ఈ సందర్భంగా క్యాంపులో నిర్వహిస్తున్న దివ్యాంగుల వైద్య పరీక్షలు, ఆన్‌లైన్ దరఖాస్తుల నమోదు విధానాన్ని ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు, సేవల లభ్యత, వైకల్యం నిర్ధారణకు వినియోగిస్తున్న పరికరాల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, ప్రతి దివ్యాంగుడికి అవసరమైన గుర్తింపు సర్టిఫికేషన్ అందేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న యూనిక్ డిసెబిలిటీ ఐడెంటిటీ (యు డి ఐ డి) కార్డులు తెలంగాణ రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందుతాయని తెలిపారు . ఈ కార్డుల ద్వారా దివ్యాంగులు ఆరోగ్య, విద్య, ఉపాధి, రవాణా తదితర రంగాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను సులభంగా పొందగలరని తెలిపారు. ప్రతి దివ్యాంగుడు సమాజంలో సమాన హక్కులు, అవకాశాలు పొందేలా ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కొత్తగా యూడీఐడీ కార్డుల కోసం దరఖాస్తు చేసిన దివ్యాంగులకు ఆసుపత్రిలో వైకల్యం నిర్ధారణ కోసం సదరం స్లాట్ బుకింగ్ చేయాలని, ముందస్తుగా దరఖాస్తుదారులకు సమాచారం అందించి సమయానికి పరీక్షలు జరిగేలా చూడాలని సూచించారు. వైద్య పరీక్షల సమయంలో అవసరమైన వైద్య నిపుణులు, పరీక్షా పరికరాలు సాంకేతిక సిబ్బంది పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సదరం క్యాంపు ప్రాంతంలో దివ్యాంగులు ఇబ్బంది పడకుండా రిసెప్షన్ సెంటర్, కుర్చీలు, నీడ, తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంపులు, వీల్‌చెయిర్లు వంటి ప్రాథమిక వసతులు కల్పించాలని సూచించారు. దివ్యాంగులకు అనుకూలమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావించాలని అన్నారు . పరీక్షల అనంతరం ప్రతి దివ్యాంగుడి వైకల్యం శాతం, వ్యక్తిగత వివరాలు, వైద్య నిపుణుల సర్టిఫికేషన్ వివరాలను సమగ్రంగా యూడీఐడీ పోర్టల్‌లో నమోదు చేసి, ఎటువంటి లోపాలు లేకుండా డేటా ఎంట్రీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దివ్యాంగుల సమాచారం డిజిటల్ రూపంలో భద్రపరచడం వల్ల భవిష్యత్తులో వివిధ పథకాల అమలుకు ఇది బలమైన ఆధారంగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ పరిశీలనలో వైద్య నిపుణులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్,కార్పొరేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు వెంటనే హాల్ టికెట్లు జారీ చేయాలి

### విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోకండి

### ఎబివిపి కరీంనగర్ జిల్లా కన్వీనర్ పూసల విష్ణు



కరీంనగర్, ఫిబ్రవరి 20(వాయిస్ టుడే): విద్యను వ్యాపారంగా మార్చి హాల్ టికెట్లు ఆపడం అన్యాయం తక్షణమే జారీ చేయాలి అని ఏబీవీపీ కరీంనగర్ జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు అన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి ఇంటర్ పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్లను ఇటీవలే విడుదల చేసింది. పరీక్షలు ఫిబ్రవరి 25/26 నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 10 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారు.కానీ, ప్రైవేట్ మరియు కార్పొరేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ఫీజు ఆలస్యం, అదనపు ఫీజులు వసూలు చేయడం వంటి కారణాలతో వందలాది మంది విద్యార్థుల హాల్ టికెట్లను ఇంకా జారీ చేయకుండా ఆపేస్తున్నారు.ఇది విద్యార్థుల హక్కులకు, వారి భవిష్యత్తుకు తీవ్ర భంగం కలిగిస్తోంది.ఇంటర్ బోర్డు హాల్ టికెట్లను కళాశాల లాగిన్‌లలో అందుబాటులో ఉంచినా,తల్లిదండ్రుల వాట్సాప్‌కు పంపినా కొన్ని కళాశాలలు వాటిని విద్యార్థులకు అందజేయడం లేదు.ఫలితంగా సుమారు 300 మందికి పైగా విద్యార్థులు పరీక్షలు రాయలేకపోతారనే ఆందోళనలో ఉన్నారు.ఇది విద్యను వ్యాపారంగా మార్చి, విద్యార్థులను బెదిరించే, బ్లాక్‌మెయిల్ చేసే చర్యగా మారింది. ప్రైవేట్,కార్పొరేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు తక్షణమే అన్ని హాల్ టికెట్లను విద్యార్థులకు అందజేయాలి.ఫీజు ఆలస్యం పేరుతో హాల్ టికెట్లు ఆపడం కఠినంగా నిషేధించాలి.రాష్ట్ర ప్రభుత్వం,ఇంటర్ బోర్డు ఇలాంటి కళాశాలలపై తక్షణ చర్యలు తీసుకోవాలి.అవసరమైతే లైసెన్స్‌లు రద్దు చేయాలి.హాల్ టికెట్లు రాని విద్యార్థులకు ప్రత్యేక అవకాశం కల్పించి,పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు రాకుండా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలి.విద్య అనేది హక్కు వ్యాపారం కాదు.విద్యార్థుల ఏడాది కష్టాన్ని,భవిష్యత్తును బలిచేసే చర్యలను ఏబీవీపీ ఖండిస్తుంది. తక్షణమే సమస్య పరిష్కారం కాకపోతే,పెద్ద ఎత్తున నిరసనలు, ఆందోళనలు చేపట్టవలసి వస్తుంది అన్నారు.



## మత్తుకు చెక్.. ప్రగతికి 'జై

### - గోవిందరావుపేట తండాలో సంపూర్ణ మద్యనిషేధం

కోనరావుపేట, ఫిబ్రవరి 20 (వాయిస్ టుడే): రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని గోవిందరావుపేట తండా సామాజిక మార్పుకు వేదికైంది. మద్యం మహమ్మారి వల్ల చితికిపోతున్న పేద కుటుంబాలను కాపాడేందుకు ఆ తండా సర్పంచ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. మహిళా సంఘాలు, గ్రామ పెద్దల విన్నపానికి తక్షణమే స్పందించిన సర్పంచ్, నేటి నుండే తండా పరిధిలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని విధిస్తున్నట్లు ప్రకటించారు,ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. "మద్యం వల్ల ప్రాణాలు పోవడమే కాకుండా, కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. మన పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే మత్తుకు దూరంగా ఉండాలి. గోవిందరావుపేట తండాను జిల్లాలోనే ఆదర్శవంతమైన మద్యం రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి" అని పిలుపునిచ్చారు.నేటి నుండి తండా పరిధిలో ఎవరైనా మద్యం అమ్మినా, తాగినా కఠిన చర్యలు తీసుకుంటాం. గ్రామ పంచాయతీ తీర్మానం ప్రకారం భారీ జరిమానాలు విధిస్తాం" అని హెచ్చరించారు. ఈ సందర్భంగాసర్పంచ్ తిరుపతి ,ఉప సర్పంచ్ శ్రీనివాస్, వార్డ్ మెంబర్లు, కు మహిళా సంఘాల ప్రతినిధులు, మరియు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## నిరుద్యోగులైన యువతి యువకులకు స్టడీ మెటీరియల్



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఫిబ్రవరి 20: ఉత్సాహవంతులైన నిరుద్యోగులైన యువతి యువకులకు డీఎస్సీ, గ్రూప్ వన్ గ్రూప్ టు, ఇతర కాంపిటేటివ్ పరీక్షలకు ప్రిపేర్ కావడానికి కావలసిన మెటీరియల్, పుస్తకాలు ఆన్లైన్ క్లాసుల నిర్వహణకు ఐటీడీఏ ద్వారా తప్పనిసరిగా సహాయ సహకారాలు అందిస్తానని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి. రాహుల్ యువతి యువకులకు భరోసా ఇచ్చారు. శుక్రవారం నాడు కొత్తగూడెంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంను గ్రంథాలయం చైర్మన్ పసుపులేటి వీరబాబు ఆహ్వానం మేరకు ఆయన సందర్శించి, గ్రంథాలయంలోని అన్ని గదులను పరిశీలించి కాంపిటేటివ్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న యువతి యువకులకు పలు సూచనలు చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ కాంపిటేటివ్ పరీక్షలకు హాజరయ్యే యువతి యువకులు శ్రద్ధగా చదివి అనుకున్నది సాధించే వరకు విశ్రమించకూడదని, అవసరమైతే అనుభవజ్ఞుల సలహాలు సూచనలు తీసుకొని పరీక్షలకు ప్రిపేర్ కావాలని అన్నారు. కాంపిటేటివ్ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ ఐటీడీఏ తరఫున అందిస్తానని అన్నారు. గిరిజన యువతి యువకులు ఇతర కాంపిటేటివ్ పరీక్షలకు ప్రిపేర్ కావడానికి మారుమూల మండలాలలో గ్రంథాలయంలు లేక ఇబ్బందులు పడుతున్నారని చంద్రుగొండ, టేకులపల్లి, దమ్మపేట మండలాలలో తప్పనిసరిగా గ్రంథాలయం నిర్మాణానికి ఐటీడీఏ ద్వారా సహకరించాలని గ్రంథాలయం చైర్మన్ వీరబాబు పిఓ దృష్టికి తీసుకురాగా ఆ మండలాలలో ప్రభుత్వ స్థలాలు ఏమైనా ఖాళీగా ఉంటే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకొని వెంటనే ప్రతిపాదనలు తనకు పంపించాలని, తప్పనిసరిగా ఆ మండలాలలో గ్రంథాలయం నిర్మాణం చేపట్టి పాఠకులకు ఇబ్బందులు కలగకుండా అన్ని వసతి సౌకర్యాలు కల్పిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, డీఈలు, ఏఈలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నా ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ము గంగుల కమలాకర్‌కు లేదు

### నాపై అసత్య ప్రచారాలు చేయించడానికి సిగ్గుండాలి

### బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిల్లపు రమేష్



కరీంనగర్,ఫిబ్రవరి 20(వాయిస్ టుడే): మాజీ మంత్రి,ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కు ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడే దమ్ము ధైర్యం లేకుండా పోయిందని,తాను సంధించిన ప్రశ్నలకు జవాబు చెప్పలేక, పనికిమాలిన వాళ్లతో నాపై అసత్య ప్రచారాలు చేయించడానికి సిగ్గుండాలనీ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు,మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ళపు రమేష్ ఘాటుగా విమర్శించారు.ఈ మేరకు గుగ్గిల రమేష్ మీడియాకు ప్రకటన విడుదల చేశారు.గంగుల కమలాకర్ పై తాను చేసిన విమర్శలకు కట్టుబడి ఉన్నానని,మాట్లాడిన భాషలో ఎక్కడ కూడా అన్ పార్లమెంటరీ వర్డ్స్ ఉపయోగించలేదన్నారు.తనుచేసిన వ్యాఖ్యలకు గంగుల కమలాకర్ తనపై విద్వేషంతో జవాబు చెప్పలేక మీడియా ముందుకు వచ్చి మాట్లాడలేక ధైర్యం,దమ్ము లేకనే ఆయన అనుచరులతో మాట్లాడిస్తున్నారని,ఇది ఆయన సిగ్గుమాలినతనానికి నిదర్శనం అన్నారు.ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే గుగ్గిల్లపు ఇంటిపై,వాసాల రమేష్ ఇంటిపై దాడులు చేయిస్తానని చెప్పిన కమలాకర్, నేటి వరకు దాడులు చేసే ధైర్యం చేయలేదనిభయపడ్డారన్నారు. గంగుల కమలాకర్ కు ఇప్పటికైనా దమ్ముంటే తాను ఎప్పుడు ఒంటరిగానే తిరుగుతానని,నువ్వు వస్తావో,నీ అనుచరులను పంపిస్తావో, దేనికైనా సిద్ధమని సవాల్ విసిరారు. అసత్య ప్రచారాలు నీ అనుచరులతో మాట్లాడించడం ఆపకపోతే నీ రాజకీయ జీవితంలో ఎన్ని మలుపులను మీడియా ముఖంగా ఆధారాలతో సహ బయట పెడతానని హెచ్చరించారు.గుగ్గిళ్ళపు రమేష్ అంటే ఆషామాషీ వ్యక్తి కాదని ఐదుసార్లు ప్రజా జీవితంలో నిలబడి గెలిచానని నీలాగా భూమాఫీయాను ప్రోత్సహించి, గుండాయిజాన్ని, రౌడీయిజాన్ని పెంచి పోషించలేదని, ప్రజలను ఇబ్బంది పెట్టేటువంటి పనులను చేయలేదని ఆయన చెప్పారు.ఇప్పటికైనా పిచ్చి ప్రేలాపనలు మానుకొని మూసుకొని కూర్చొని ఉండాలన్నారు.రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో నిన్ను రాజకీయంగా బొంద పెట్టడమే లక్ష్యంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ నాయకత్వంలో,బిజెపి పని చేస్తుందన్నారు. ఎమ్మెల్యేగా ఎలా గెలుస్తావో చూస్తామని, మేము సవాల్ విసురు తున్నమనీ, ఈ సవాలుకు నువ్వు కట్టుబడి ఉండు నీకు దమ్ముంటే గెలిచి చూపించు, నువ్వు ఎలా గెలుస్తావో మేము చూస్తామని సవాల్ విసిరారు.2028లో బిజెపిని అడ్డుకొని చూడు నీకు దమ్ముంటే, నువ్వు ఎమ్మెల్యేగా నిలబడు నీస్థానం ఏమిటో చూపిస్తామన్నారు.నీ చుట్టూ ఉన్న కోటరీ మాయం చేశాం,కేవలం డబ్బుకు నీ ఎంగిలి మెతుకులకు ఆశపడ్డ వాళ్ళు మాత్రమే నీవద్ద మిగిలారని,డబ్బు బలంతోనే నువ్వు మిగిలి ఉన్నావని,గంగుల ప్రజాబలం ప్రజావిశ్వాసం కోల్పోయాడని ఎద్దేవా చేశారు.

# ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ అవగాహన సదస్సు




భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఫిబ్రవరి 20 : శుక్రవారం న ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ సందర్భంగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం షాలేం రాజు ఆదేశానుసారం కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో కాన్ఫరెన్స్ నందు జనరల్ మేనేజర్ కార్యాలయ అధికారులకు, ఉద్యోగులకు మెడికల్ ఔ హెల్త్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో క్యాన్సర్ పై అవగాహన సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మెయిన్ హాస్పిటల్ హెల్త్ ఆఫీసర్ డా॥ డి. లలిత కుమారి మాట్లాడుతూ ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 4న ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం (వరల్డ్ క్యాన్సర్ డే)ను నిర్వహిస్తారు. ఈ దినోత్సవాన్ని యూనియన్ ఫర్ ఇంటర్నేషనల్ క్యాన్సల్ కంట్రోల్ (యుఐసిసి) ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, ముందస్తు నిర్ధారణ సమయానుకూల చికిత్స ప్రాముఖ్యతను తెలియజేయడం, అలాగే క్యాన్సర్ బాధితులకు మానసిక, సామాజిక మద్దతు కల్పించడం అని అన్నారు.

**క్యాన్సర్ -- ఒక ప్రపంచ సమస్య**

ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం లక్షలాది మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. ఊపిరితిత్తుల క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, నోటి క్యాన్సర్ వంటి అనేక రకాల క్యాన్సర్లు విస్తరిస్తున్నాయి. జీవనశైలిలో మార్పులు, పొగాకు వినియోగం, మద్యపానం, అసమతుల్య ఆహారం, వ్యాయామం లోపం కాలుష్యం వంటి కారణాలు క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతున్నాయని నివారణ ముందస్తు నిర్ధారణ క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స విజయవంతమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, పొగాకు వినియోగాన్ని పూర్తిగా మానేయడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, రోజువారీ వ్యాయామం చేయడం ద్వారా క్యాన్సర్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. మహిళలు రొమ్ము గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం అత్యంత అవసరమని అన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన -- జీవన రక్షణకు మొదటి అడుగు" అనే సందేశంతో, మనమందరం కలిసి క్యాన్సర్‌ను ఎదుర్కొని, బాధితులకు మద్దతుగా నిలుద్దాం. సమయానికి నిర్ధారణ, సరైన చికిత్స మరియు ధైర్యం ఉంటే క్యాన్సర్‌ను జయించవచ్చని అన్నారు. అనంతరం డాక్టర్ జీఎం కార్యాలయంలోని అధికారులు, ఉద్యోగస్తులు క్యాన్సర్ పై అడిగిన సందేహాలను నివృత్తి పరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం జి.వి. కోటి రెడ్డి తో పాటు ఏరియా ఇంజనీర్ కే సూర్యనారాయణ రాజు, ఎజిఎం (ఫైనాన్స్) ఈ. భీభాత్స, ఎజిఎం (పర్సనల్) జీవి. మోహన్ రావు, రుద్రంపూర్ డిస్పెన్సరీ మెడికల్ సూపర్డెంట్ ఏం పరశురాములు, మెయిన్ హాస్పిటల్ హెల్త్ డాక్టర్ డి లలిత కుమారి జనరల్ మేనేజర్ కార్యాలయంలోని వివిధ విభాగాల అధిపతులు, అధికారులు, ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

## బంజారాల మార్గదర్శకులు సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు ఖానాపూర్



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఫిబ్రవరి 20: ఖానాపూర్ లో బంజారాల ఆధ్యాత్మిక మార్గదర్శకులు సంత్ సేవాలాల్ మహారాజ్ గారి 287వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలకు బంజారా సమాజానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, బంజారా నాయకులు, సోదర సోదరీమణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ బోధనలు సమాజంలో ఐక్యత, సేవాభావం, నైతిక విలువలకు ప్రేరణగా నిలుస్తాయని తెలిపారు.సంత్ సేవాలాల్ మహారాజ్ బాసరలో గోదావరి నది తీరాన 45 రోజులపాటు దీక్షలో కొనసాగిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.అలాగే బాసరలో 5 ఎకరాల విస్తీర్ణంలో సంత్ సేవాలాల్ మహారాజ్ మందిర నిర్మాణానికి ముఖ్యమంత్రికి విన్నవించి, ఆలయ నిర్మాణం కోసం కంకణబద్ధులై పనిచేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు .బంజారా సమాజ ఆధ్యాత్మికాభివృద్ధికి తమవంతు కృషి కొనసాగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## ముగిసిన వార్డు మెంబర్ల శిక్షణ కార్యక్రమం



మాడుగులపల్లి ఫిబ్రవరి20( వాయిస్ టుడే): గత నాలుగు రోజులుగా మండల కేంద్రంలోని ఎమ్మార్సీ బిల్డింగ్ ఆవరణలో నిర్వహిస్తున్న వార్డ్ మెంబర్ల మొదటి బ్యాచ్ శిక్షణ కార్యక్రమం నేటితో ముగిసింది. ఈ సందర్భంగా ఎంపిడిఓ వంశీధర్ మాట్లాడుతూ జిల్లా పంచాయతీ అధికారి ఆదేశానుసారం వార్డ్ మెంబర్లకు శిక్షణ కార్యక్రమంలో వారి విధివిధానాలు బాధ్యతలు గ్రామపంచాయతీ అభివృద్ధికి ఏ విధంగా పాటుపడాలని వారికి శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు అదేవిధంగా ప్రతి ఒక్క వార్డ్ మెంబర్ కి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రచురించిన గ్రామపంచాయతీ పాలనకు సంబంధించిన పుస్తకాలను అందించడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సంగీత జూనియర్ అసిస్టెంట్ శభిరాబేగం వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యం నాణ్యత లేకుండా సిసి రోడ్ల నిర్మాణం

**పర్యవేక్షణ లేదు పట్టించుకునే వారు లేరు కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం**





వాయిస్ టుడే ప్రతినిధి ఫిబ్రవరి 21 హుస్నాబాద్ ప్రతినిధి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపల్ పరిధిలో గల పలు వార్డుల్లో నాణ్యత లేకుండా లేకుండా ఇష్టారీతిలో అధికారుల పర్యవేక్షణ లేకుండా సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా పలు వార్డుల్లో నాణ్యత లేకుండా నిర్వహిస్తున్న సిసి రోడ్లకు కనీసం అధికారులు పర్యవేక్షణ కూడా చేయకపోవడం నాసిరకం ఇసుక కంకర వాడకంపై రోడ్లు నిర్మిస్తున్నారని పలు వార్డుల్లో ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒక వార్డులో అయితే కరెంటు స్తంభం మధ్యలో ఉండగా ఇష్టమొచ్చిన రీతిలో సిసి రోడ్లు నిర్మించారు ఇక్కడ స్తంభానికి ఢీకొని ప్రమాదాలు జరిగితే బాధ్యులు అని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కనీసం మధ్యలో స్తంభం ఉందన్న అవగాహన అధికారులు లేకుండా పోవడం శోచనియమని ప్రజల బహిరంగంగా విమర్శిస్తున్నారు. పట్టణంలో సిసి రోడ్ల నిర్మాణం జరుగుతున్న కనీసం పట్టణ ఏఈ పర్యవేక్షణ లేదు వర్క్ ఇన్స్పెక్టర్ పర్యవేక్షణ లేదు ఫోన్ చేసిన స్పందన లేదు కాంట్రాక్టర్ తన ఇష్టం వచ్చినట్టుగా నాణ్యతలేని ఇసుకను కంకరను వాడి నిర్మాణం చేపడుతున్నాడు మరి పర్యవేక్షణ చేయవలసిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని మాకేం సంబంధం కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణం నాణ్యతతో సంబంధం లేదు అని ప్రవర్తిస్తున్నాడని ప్రజల్లో గుసగుసలు వినబడుతున్నాయి పట్టణంలో ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి పనులుజరుగుతున్న అధికారులకు మాత్రం పర్యవేక్షణ లోపం ఉందని దీని సరి చేయవలసిన ఉన్నతాధికారులు కూడా చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేస్తున్నారు గతంలో నాణ్యత లోపంతో పోసిన కొన్ని సిసి రోడ్లు ఇప్పుడు మళ్లీ రిపేర్లకు వచ్చాయని మధ్యలో గుంతలు పడడం లాంటి జరుగుతున్నాయని ప్రజలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు ఇదంతా జరుగుతున్న అధికారులు అసలు ప్రజలు ఫోన్ చేసినా కూడా ఎత్తడం లేదు మరి పట్టణానికి సంబంధించిన ఏ ఈఅవసరానికి పనుల నిమిత్తం ఫోన్ చేసినా స్పందించడం లేదని ప్రభుత్వం ప్రభుత్వ అధికారులకు ఫోన్ సౌకర్యం కల్పించి ప్రజలకు ఫోన్ చేస్తే సమాధానం చెప్పాలని ఎప్పటికప్పుడు చెప్తుంటే అధికారులు మాత్రం మాకేం సంబంధం లేదన్నట్టుగా ఎవరు వ్యవహరిస్తున్నారని ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు గతంలో కూడా చాలా సమయాల్లో మున్సిపల్ ఏఈకి ఫోన్ చేస్తే ఫోన్ ఎత్తడం లేదని లేదంటే స్విచ్ ఆఫ్ చేస్తున్నాడని చాలాసార్లు ప్రజలు బహిరంగంగా విమర్శించారు అయినా కూడా ఏ ఈ తన తీరు మార్చుకోవడం లేదు అధికారులు కూడా అతనిపై చర్య తీసుకోవడం లేదు ఇకనైనా అధికారులు మేలుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారుమున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న సమయంలో కాంట్రాక్టర్ ఇష్టం వచ్చినట్టు రోడ్లు నిర్మించాడని సిసి రోడ్లన్నీ నిర్మాణంలో ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా నాణ్యత లేకుండా రోడ్లు నిర్మించారని తెలిపారు. ఇప్పటికైనా పట్టించుకోని మున్సిపల్ అధికారులపై, కాంట్రాక్టర్ పై నూతన పాలకవర్గం స్పందించి నాణ్యత లేకుండా నిర్మిస్తున్న సీసీ రోడ్లను పరిశీలించి తగుచర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు నూతనంగా ఎన్నికైన పాలకవర్గం అధికారులను ప్రజలు తమ అవసరాల నిమిత్తం ఫోన్ చేస్తారని ఫోన్ లిఫ్ట్ చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు పురపాలక సంఘం చైర్పర్సన్ ను కోరుతున్నారు మరి కోరుకుందాం నూతన చైర్ పర్సన్ అధికారుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం

## నర్సాపూర్లో సేవాలాల్ జయంతి వేడుకలు



నర్సాపూర్ (వాయిస్ టుడే) : సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలను శుక్రవారం నాడు ఘనంగా నిర్వహించారు నర్సాపూర్ పట్టణంలో సేవాలాల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా నర్సాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ మురళీధర్ యాదవ్ నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్ మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ అనుసరించిన బోధనలు నేటి సమాజానికి ఆదర్శమని వారు అన్నారు బంజారా సమాజం చరిత్ర సంస్కృతి సాంప్రదాయాలపై సమగ్ర వివరించారు జ్ఞానంతో పాటు నైపుణ్య అభివృద్ధిలో రావాలని పలువురికి సూచించారు ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు సేవాలాల్ నాయకులు బంజారా నాయకులు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



## సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

**- నూతన కౌన్సిలర్లకు కలెక్టర్ ప్రావీణ్య సూచన**

**- కలెక్టర్‌ను సన్మానించిన మున్సిపల్ నూతన పాలకవర్గం**

వాయిస్ టుడే సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సంగారెడ్డి: మున్సిపల్ అభివృద్ధికి సదా తాను అండగా ఉంటానని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య హామీ ఇచ్చారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన సంగారెడ్డి మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులు శుక్రవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని సంగారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ



సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి ఇచ్చిన హామీల మేరకు సంగారెడ్డి మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలకు కట్టుబడి ఉన్నామని పాలకవర్గ సభ్యులు కలెక్టర్‌కు వివరించారు. మెరుగైన పారిశుధ్యం, ఇంటింటికి శుద్ధమైన తాగునీరు, ప్రతి గల్లీలో సీసీ రోడ్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. మున్సిపల్ పాలకవర్గంలో యువతీ, యువకులు ఎక్కువగా ఉండడం మున్సిపాలిటీ అభివృద్ధికి ఎంతో ప్రయోజనకరమని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వేగంగా పరిష్కరించాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో టీపీసీసీ చైర్ పర్సన్ నిర్మలాజగ్గారెడ్డితో కౌన్సిలర్లు సెల్ఫీలు దిగారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్, సంగారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ షఫీ హఫీజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బొంగుల రవి, కూన సంతోష్, కౌన్సిలర్లు శ్రీకాంత్, ప్రశాంత్ రెడ్డి, రవి నాయక్, గుర్రం ఝాన్సీ, మోతే శ్యామ్, తోపాజీ వీణ, మమ్మద్ ఖాజా నవాజుద్దీన్, వంశీయాదవ్, జి.మనీషా, తదితర కౌన్సిలర్లు పాల్గొన్నారు.



## సీ. సీ. రోడ్డుకు శంకుస్థాపన చేసిన సర్పంచ్ వడ్డే సైదిరెడ్డి

మాడుగులపల్లి ఫిబ్రవరి 20 (వాయిస్ టుడే): మండల పరిధిలోని చెరువుపల్లి గ్రామపంచాయతీలో మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన ఐదు లక్షల రూపాయలతో వైకుంఠధామం వరకు సీ. సీ. రోడ్డుకు శుక్రవారం గ్రామ సర్పంచ్ వడ్డే సైదిరెడ్డి శంకుస్థాపన చేశారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మనసాని వినోద్,గ్రామ కార్యదర్శి సతీష్ రెడ్డి, వార్డ్ మెంబర్లు ఐటిక్యాల నాగిరెడ్డి, ఉప్పు నాగరాజు,గ్రామ పెద్దలు చెరువుపల్లి రాజు, చిలకరాజు పరశురాములు, బొర్రాజు సైదులు, కోటిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రామ్మూర్తి, లచ్చయ్య,శేఖర్, రామకృష్ణ, వెంకన్న, నాగరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా సర్పంచ్ పోలు సంపత్ నియామకం

### హర్షం వ్యక్తం చేసిన గాంధీనగర్ గ్రామస్తులు

హుస్నాబాద్, వాయిస్ టుడే ప్రతినిధి ఫిబ్రవరి 21 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల గ్రామ సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా గాంధీనగర్ గ్రామ సర్పంచ్ పోల్ సంపత్ ను ఎన్నుకున్నారు ఈ సందర్భంగా గాంధీ నగర్ గ్రామ సర్పంచ్ పోల్ సంపత్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఈ పదవిని ఇచ్చినందుకు తోటి సర్పంచులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు అంతేకాకుండా హుస్నాబాద్ ఎమ్మెల్యే మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్పంచ్ల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి తెలియజేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రభుత్వం నుండి రావలసిన గ్రామపంచాయతీ బకాయిలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ సహకారంతో పరిష్కారం అయ్యే దిశగా ప్రయత్నం చేస్తానని సర్పంచులకు ఎదురయ్యే ప్రతి సమస్యను అందరం కలిసికట్టుగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎల్లప్పుడు ప్రజలకు సర్పంచులు అందుబాటులో ఉండి సేవలందించి గ్రామాలకు మంచి పేరు తీసుకువచ్చి ప్రభుత్వం ద్వారా సంక్షేమ ఫలాలు పొందేందుకు ప్రయత్నం చేయాలని తెలియజేశారు నన్ను సర్పంచ్గా గెలిపించిన గాంధీ నగర్ గ్రామ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు అని ఎల్లప్పుడూ వారి సేవలో ఉంటానని వారికి ఎప్పుడు ఏ ఆపద వచ్చినా ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తానని వారి ద్వారానే నాకు ఈ పదవి లభించింది అని దీన్ని దుర్వినియోగం చేయకుండా ప్రజల కోసం సద్వినియోగం చేస్తానని తెలియజేశారు ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.



## మక్తల్ మున్సిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి ఉంటాం ..

### బాధ్యతలు స్వీకరించిన మక్తల్ మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు

మక్తల్, ఫిబ్రవరి 20 వాయిస్ టుడే ప్రతినిధి: మక్తల్ మున్సిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి ఉంటామని, స్థానిక మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి అండదండలతో మునిసిపాలిటీని అభివృద్ధి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని మక్తల్ మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు తెలిపారు. మున్సిపాలిటీలోని చైర్మన్ చాంబర్లో శుక్రవారం ఉదయం పురోహితుల సమక్షంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం మంత్రి వాకిటి శ్రీహరి సమక్షంలో మున్సిపల్ చైర్ పర్సన్ గా వాకిటి మానస హనుమంతు బాధ్యతలు స్వీకరించారు. వైస్ చైర్ పర్సన్ శైవిరెడ్డి సైతం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు మాట్లాడుతూ... నియోజకవర్గం లో మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, మంత్రి చేపట్టిన అభివృద్ధిని చూసి మక్తల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకి అఖండ మెజారిటీ అందించారని అన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి సూచనల మేరకు మక్తల్ మున్సిపాలిటీకి అధిక నిధులను తీసుకువచ్చి, మంత్రి వాకిడి శ్రీహరి మార్గదర్శకత్వంలో మక్తల్ మున్సిపాలిటీ ని రాష్ట్రంలోనే అత్యున్నత స్థాయిలో నిలబెట్టేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా వైస్ చైర్ పర్సన్, వార్డు కౌన్సిలర్లు, అధికారులు, పురపాలక సిబ్బంది అందరి సహకారాలతో అభివృద్ధి సాధ్యమవుతుందని సూచించారు. కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి గారి సతీమణి వాకిటి లలిత, మార్కెట్ చైర్ పర్సన్ రాధా లక్ష్మారెడ్డి, అన్ని వార్డుల కౌన్సిలర్లు, చంద్రకాంత్ గౌడ్ గణేష్ కుమార్, రవికుమార్, కల్లూరి గోవర్ధన్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా బొమ్మగాని రాజకుమార్ నియామకం

### హర్షం వ్యక్తం చేసిన పోతారం గ్రామస్తులు

హుస్నాబాద్, వాయిస్ టుడే ప్రతినిధి ఫిబ్రవరి 21 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల గ్రామ ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా పోతారం గ్రామ ఉపసర్పంచ్ బొమ్మగాని రాజకుమార్ ను ఎన్నుకున్నారు ఈ సందర్భంగా పోతారంగ్రామ ఉపసర్పంచ్ బొమ్మగాని రాజ్ కుమార్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఈ పదవిని ఇచ్చినందుకు తోటి ఉపసర్పంచులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు అంతేకాకుండా హుస్నాబాద్ ఎమ్మెల్యే మంత్రి పొన్నం ప్రభాకర్ కుప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు ఈ సందర్భంగా ఉప సర్పంచ్ బొమ్మగాని రాజ్ కుమార్ మాట్లాడుతూఉపసర్పంచ్ల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి తెలియజేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రభుత్వం నుండి రావలసిన గ్రామపంచాయతీ బకాయిలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ సహకారంతో పరిష్కారం అయ్యే దిశగా ప్రయత్నం చేస్తానని ఉపసర్పంచులకు ఎదురయ్యే ప్రతి సమస్యను అందరం కలిసికట్టుగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎల్లప్పుడు ప్రజలకు ఉప సర్పంచులు అందుబాటులో ఉండి సేవలందించి గ్రామాలకు మంచి పేరు తీసుకువచ్చి ప్రభుత్వం ద్వారా సంక్షేమ ఫలాలు పొందేందుకు ప్రయత్నం చేయాలని తెలియజేశారు నన్ను ఉప సర్పంచ్ గా గెలిపించిన పోతారం గ్రామ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు అని ఎల్లప్పుడూ వారి సేవలో ఉంటానని వారికి ఎప్పుడు ఏ ఆపద వచ్చినా ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తానని వారి ద్వారానే నాకు ఈ పదవి లభించింది అని దీన్ని దుర్వినియోగం చేయకుండా ప్రజల కోసం సద్వినియోగం చేస్తానని తెలియజేశారు ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ఉప సర్పంచులు పాల్గొన్నారు.

# మక్తల్ వాసిగా మక్తల్‌లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం నా అదృష్టం





### ఈసారి బడ్జెట్లో క్రీడలకు 1600 కోట్లు కేటాయింపు..

### స్పోర్ట్స్ రిజర్వేషన్ 2 నుంచి 5 శాతానికి పెంపునకు చర్యలు..

### మక్తల్ లో సీఎం కప్ కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభం

### తెలంగాణ రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి

మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో సీఎం కప్ రెండో ఎడిషన్ లో భాగంగా శుక్రవారం రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించడం మక్తల్ వాసిగా తన అదృష్టమని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. కలెక్టర్ సిక్తాపట్నాయక్, ఎస్పీ వినీత్ కుమార్ తో కలిసి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు 33 జిల్లాల నుంచి పురుషులు మహిళల విభాగంలో 66 జట్లు తలపడనుండగా, దాదాపు 1500 మందికి పైగా క్రీడాకారులు కోచ్ లు, పీఈటీలు, సహాయక సిబ్బంది పాల్గొంటారని, వారికి మక్తల్ లో అన్ని సదుపాయాలు కల్పిస్తూ సరైన వసతి, ఆహారం సూచించిన మేరకు అందిస్తూ మంచి ఆతిథ్యం కల్పిస్తున్నామని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో సరికొత్త క్రీడా పాలసీని తీసుకొచ్చామని, ఇందులో భాగంగా దాదాపు 25 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు క్రీడారంగంలోకి వచ్చాయని తెలిపారు. గతంలో బడ్జెట్లో క్రీడా శాఖకు కేవలం ఏడాదికి 200 కోట్ల నుంచి 300 కోట్లు మాత్రమే కేటాయించే వారిని, రాబోయే బడ్జెట్లో ఏకంగా క్రీడా శాఖకు 1600 కోట్ల బడ్జెట్ ను ముఖ్యమంత్రి కేటాయిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. దీంతోపాటు క్రీడాకారులకు స్పోర్ట్స్ రిజర్వేషన్ ను 2 శాతం నుంచి 5 శాతానికి పెంచేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 120 మంది అంతర్జాతీయ క్రీడాకారులకు తెలంగాణ రాష్ట్రం నుంచి విదేశాల్లో అంతర్జాతీయ టోర్నీలో పాల్గొనడానికి దాదాపు 600 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిందని, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనే వారికి రవాణా ఖర్చులతో పాటు ఇతర ఖర్చులు సైతం రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా భరిస్తుందని భరోసా ఇచ్చారు. ఒలింపిక్స్ లాంటి అంతర్జాతీయ స్థాయి క్రీడా ఈవెంట్లలో మెడల్ సాధించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫునుంచి నేరుగా 3 కోట్ల 50 లక్షల రూపాయల ప్రోత్సాహక బహుమతి అందిస్తున్నామని అన్నారు. గతంలో ఆటలు ఆడితే తల్లిదండ్రులు తిట్టే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆటలు ఆడకపోతే తిట్టే పరిస్థితి ఉందని, ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. కబడ్డీ పోటీకి 4 వేల సంవత్సరాల చరిత్ర ఉందని, ఇప్పటికే భారత జట్టు కబడ్డీలో మూడు వరల్డ్ కప్ లు సాధించిందని గుర్తు చేశారు. ప్రో కబడ్డీ లీగ్ లో సైతం ప్లేయర్లకు చాలా డిమాండ్ ఉందని అన్నారు. మక్తల్ గ్రౌండ్ తో తనకు విడదీయరాని అనుబంధం ఉందని, రక్తాలు కారే వరకు ఆటలాడేవాళ్ళమని, తర్వాత రోజు గాయాలు తెలిసేవని అన్నారు. 25 కోట్ల రూపాయలతో మక్తల్ గ్రౌండ్ ను స్టేడియం గా రూపొందిస్తున్నామని, ఇందులో స్విమ్మింగ్ పూల్ తో పాటు రెండు కబడ్డీ కోర్టులు ఇండోర్ స్టేడియం, క్రికెట్ మైదానం ఉంటుందని, అతి త్వరలో పనులు ప్రారంభించి సాధ్యమైనంత త్వరగా అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. నారాయణపేట జిల్లా కేంద్రానికి కిసైతం మినీ స్టేడియం కోసం 25 కోట్లు కేటాయించామని కలెక్టర్ కు తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే 33 జిల్లాల జట్లకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం, క్రీడా జెండాను ఎగురవేసి క్రీడాజ్యోతి వెలిగించారు. చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. పోటీల్లో భాగంగా నల్గొండ నిర్మల్ జట్ల మధ్య తొలి మ్యాచ్ మంత్రి వాకిట్లో ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వర్ల విజయ్ కుమార్, జిల్లా క్రీడా యువజన శాఖ అధికారి వెంకటేష్ శెట్టి, మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు, వైస్ చైర్ పర్సన్ శైవిరెడ్డి, వార్డ్ కౌన్సిలర్ ఆలుకూరి పావని , రహీం పటేల్, కలాల్ శ్రీవిద్య, జుట్ల అనిత, మహేష్ కుమార్, సరిత,మార్కెట్ చైర్ పర్సన్ రాధా లక్ష్మారెడ్డి, మార్కెట్ వైస్ చైర్పర్సన్ గణేష్ కుమార్, బిజెపి రాష్ట్ర నాయకులు బి కొండయ్య, చంద్రకాంత్ గౌడ్, కోల్ల వెంకటేష్, కట్ట సురేష్ గుప్త,వార్డు కౌన్సిలర్లు, పీఈటీలు, స్థానిక నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా పాలన తోటే ప్రజలకు శ్రీరామరక్ష

### వేముల శ్రవణ్ తెలంగాణ సాంస్కృతిక సారథి టీం లీడర్

నల్గొండ ఫిబ్రవరి 20 (వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రజలందరూ ప్రజా పాలనలో సుభిక్షంగా సురక్షంగా ఉంటున్నారని సూర్యాపేట జిల్లా సారథి టీం లీడర్ వేముల శ్రవణ్ అన్నారు రెండు సంవత్సరాల కాలంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ప్రజలకు అందుబాటులో ఉంచుతూ ఆరు గ్యారెంటీలు అమలు చేసే దిశలో ప్రభుత్వం అడుగులు వేస్తూ ముందుకు పోతోంది అని అన్నారు మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణమాఫీ, పేదలకు సన్నబియ్యం, నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం, నిరుద్యోగులకు ఉద్యోగ నియామకాలు, తదితర అంశాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి సూర్యాపేట జిల్లా వేముల శ్రవణ్ కళాబృందం ఆటపాటల ద్వారా తుంగతుర్తి నియోజకవర్గం, కొత్తగూడెం గ్రామంలో ప్రజలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కళారూపాల ద్వారా అవగాహన కల్పించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో గ్రామ ప్రజలు, కళాకారులు వెన్నెల నాగరాజు, లక్ష్మి, సైదులు, వేణు,ప్రియాంక, శిరీష,స్రవంతి, ప్రియదర్శిని,ఇంద్రజ పాల్గొన్నారుద.



## మాలమహానాడు ఆధ్వర్యంలో నూతన కౌన్సిలర్లకు ఘన సన్మానం

హుజూర్ నగర్ ఫిబ్రవరి 20 (వాయిస్ టుడే ప్రతినిధి): హుజూర్నగర్ మండల మాల మహానాడు అధ్యక్షులు కామల్ల రాజా ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి నూతనంగా ఎన్నికైన మాల కులానికి చెందిన కౌన్సిలర్లు అయినా దగ్గుపాటి కవిత బాబురావు ,బొల్లెద్దు ధనమ్మ జైలు నల్లగొండ సుజాత చంటి,లను పూలమాలలు శాలువలతో ఘనంగా సన్మానించడం జరిగింది ఈ సందర్భంగా కామల్ల రాజ మాట్లాడుతూ మాలలంతా ఐక్యంగా ఉండి అన్ని రంగాలలో అభివృద్ధి చేశీదాలని ముఖ్యంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పిన విధంగా రాజకీయ అధికారమే అన్ని సమస్యలకు పరిష్కారం చూపే మాస్టర్ కీ అన్నట్లుగా రాజకీయ రంగంలో రాణించాలని అన్నారు ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా మాల మహానాడు కో కన్వీనర్లు గొట్టేముక్కల రాములు ఇట్టి మల్ల బెంజిమెన్ ఇట్టి మల్లా శ్రీను కోలాపొడి దయాకర్ జాతీయ మాల మహానాడు కమిటీ అధ్యక్షులు పోతుల జ్ఞానయ్య మాల మహానాడు మహిళా జిల్లా అధ్యక్షురాలు చప్పిడి సావిత్రి మాల కుల పెద్దలు తుమ్మకమ్మ ప్రకాశం దాసరి రాములు దాసరి పున్నయ్య కోలపూడి కళ్యాణ్ పాలడుగు వెంకటేశ్వర్లు ఉండేటి కిషోర్ కోలా పూడి ప్రవీణ్ లక్కమల్ల రాములు ఇట్టి మల్ల విమన్ పాశం కోటమ్మ కోలాపుడి కమలాకర్ మాజీ కౌన్సిలర్ కంకణాల పుల్లయ్య పాశం నరసింహారావు జగన్ జెట్టి ప్రసాద్ బొల్లెద్దు వెంకటేశ్వర్లు ఉండేటి ప్రభువు పాల్గొన్నారు.

## డాక్టరేట్ అందుకున్న కిన్నెర మొగులయ్యకు సన్మానం

### అరుదైన కళాకారుడికి అభినందనలు : వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ మహేశ్




ఎల్బీనగర్, వాయిస్ టుడే న్యూస్, ఫిబ్రవరి 20 తెలంగాణ సంస్కృతిలో అరుదైన కళగా పేరొందిన 12 మెట్ల కిన్నెర గానాన్ని ప్రపంచానికి చాటిన గొప్ప కళాకారుడు పద్మశ్రీ దర్శనం మొగులయ్య' అని వనస్థలిపురం పోలీస్ ఇన్‌స్పెక్టర్ టి. మహేశ్ అన్నారు. అంతరించి పోతున్న కళను తన ప్రదర్శనల ద్వారా వెలుగులోకి తెచ్చిన మొగులయ్యకు ఇటీవల చెన్నైలోని 'గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ' గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం వనస్థలిపురం పీఎస్‌కు వచ్చి ఇన్‌స్పెక్టర్ మహేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐ మొగులయ్యను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. కళారంగంలో వారి కృషి రాష్ట్రానికి , దేశానికి గౌరవాన్ని తీసుకువచ్చిందని ఇన్‌స్పెక్టర్ టి.మహేశ్ ప్రశంసించారు.

## వెస్ట్ క్రాంతి కాలనీ అసోసియేషన్ సభ్యులకు సన్మానం

### (281/2024) నూతన సభ్యులను సన్మానించిన మాజీ కార్పోరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి



మేడిపల్లి, వాయిస్ టుడే న్యూస్, ఫిబ్రవరి 20 : మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని 9 వ డివిజన్ మేడిపల్లి వెస్ట్ క్రాంతి కాలనీ కాల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు క్రిష్ణయ్య గౌడ్, మల్లారెడ్డి నూతన అధ్యక్షులుగా, కోతోల్లా నర్సింహులు,ఉపాధ్యక్షులు, సత్యనారాయణ గౌడ్, అశోక్ రెడ్డి, తిరుమలేష్ ప్రధాన కార్యదర్శిగా కృష్ణ స్వామి కార్యనిర్వాహన అధ్యక్షులు శివ రాజ్, హీరా లాల్ నాయక్,కోశాధికారిగా సురేందర్ రెడ్డి, ఎన్నికైయ్యారు. అశోషియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి ని కలిశారు, ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి, నూతనంగా ఎన్నికైన సభ్యులను శాలువాతో తో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లొ కాలనీ పెద్దలు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

# పేదల జోలికొస్తే ఊరుకోం..

**పేదల పొట్ట కొడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం**

**చెరబండ కాలనీవాసులకు అండగా రాష్ట్ర మానవ కమిషన్**

**ఎమ్మెల్యే నాయిని నిజస్వరూపం బయటపడుతుంది..**

**నాయిని రాజీనామా చేసి గెలువు.. నేను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా**

**ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్**



హనుమకొండ,వాయిస్ టుడే: అధికారం ఉంది కదా అని అభాగ్యులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోం అని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్,మాజీ శాసనసభ్యులు,బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ హెచ్చరించారు. భద్రకాళి దేవస్థానం వద్ద ఉన్న చెరబండ రాజుల కాలనీవాసులతో కలిసి శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ జాతిపిత కేసీఆర్ అని..60 ఏండ్ల ప్రత్యేక తెలంగాణ కలను సాకారం చేశారన్నారు. తెలంగాణ సాధన కోసం గాంధీ మార్గంలో పోరాడారు అని,సాధించిన తెలంగాణను అంబేద్కర్ స్ఫూర్తితో దేశానికి ఆదర్శంగా నిలిపారని తెలిపారు. 500 పైగా సంక్షేమం పథకాలను కేసీఆర్ అమలు చేశారని,విద్యలో వినూత్నశీ గా విదేశీ విద్యను ప్రవేశపెట్టారన్నారు. 10 ఏండ్ల బీఆర్ఎస్,కేసీఆర్ పాలనలో సంక్షేమం అభివృద్ధి ప్రజలకు చేరువైందని వినయ్ భాస్కర్ అన్నారు. కాంగ్రెస్ 2 ఏళ్ల పాలన నీచమైన పాలన కొనసాగిస్తోందని.. దళితులను దూషిస్తోందని,దళిత నాయకులను అరెస్ట్ చేస్తు దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల వరకే రాజకీయం కానీ కాంగ్రెస్ నాయకులు ప్రజా సంక్షేమం మరిచి నిరంతరం రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 420 హామీలు 6 గ్యారంటీల అమలు మరిచారని,ప్రజల తరపున ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకుల పై ప్రతీకార చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. దళితులు గుడిసెలు వేసుకొని ఉండడం తప్పా అని ప్రశ్నించారు. ఇక్కడ రాజ్యాంగం పై అవగాహన లేని ప్రజాప్రతినిధులు ఉన్నారన్నారు. పేదలకు నీళ్లు,కరెంట్ కట్ చేయిస్తూ ఇల్లు కూల్చుతామని బెదిరిస్తున్నారని ధ్వజమెత్తారు. బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగం ప్రజలకు కనీస హక్కులను ఇచ్చిందని,ఆ హక్కులను కాంగ్రెస్ కాలరాస్తోందని మండిపడ్డారు. ఈ వినయ్ భాస్కర్ అధికారం ఉన్నా లేకున్నా ప్రజలతోని ఉంటాడని..ప్రజల తరపున పోరాడుతాడని..బడుగు బలహీన వర్గాలకు అన్ని వర్గాలకు అండగా ఉంటాడని హామీనిచ్చారు. మానవ హక్కుల కమిషన్ దగ్గరకు వెళ్లడం జరిగిందని,రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ అక్తర్ కు ధన్యవాదాలు తెలిపారు. చెరబండ రాజు కాలనీ వాసులు అండగా ఉన్న అందరికి కృతజ్ఞతలు అని,బీఆర్ఎస్ లీగల్ సెల్ వారికి వినయ్ భాస్కర్ ధన్యవాదాలు తెలిపారు.

**నాయిని నిజ స్వరూపం బయట పడుతోంది..**

రెండేళ్లు గడిచాయ్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నిజస్వరూపం బయట పడుతోందని వినయ్ భాస్కర్ విమర్శించారు. పిచ్చి పిచ్చి మాటలలు వెకిలి చేష్టలు చేస్తున్నావ్..పేదల ఇండ్లు కూల్చుడు కాదు పేదలకు పట్టాలు ఇవ్వు ప్రజలకు అందుబాటులో ఉండు అని హెచ్చరించారు. పేదల గుడిసెలు,చిరు వ్యాపారుల జోలికి రావొద్దని,అధికారులు పేదల జోలికి వెళ్ళకండని,పేదల సమస్యను మనసుతో విని న్యాయం చేయాలని విజ్ఞప్తిచేశారు. నాయిని నువ్వు చేస్తున్న అభివృద్ధి మీద నమ్మకం నీకుంటే,నామీద నువ్వు చేసిన విమర్శలు నిజమని నువ్వు నమ్మితే రాజీనామా చేసి గెలువు.. నేను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని వినయ్ భాస్కర్ మరొకసారి సవాలు విసిరారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం జనతా గ్యారేజ్ లా పనిచేస్తోందని, గులాబీ శ్రేణులు ప్రజల తరపున పోరాడుతున్నారని వినయ్ భాస్కర్ తెలియజేశారు.



## హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ నుండి బంకర్ బెడ్ల పంపిణీ

ఝరాసంగం 20 (వాయిస్ టుడే): ఝరాసంగం.మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కార్పొరేట్ సామాజిక బాధ్యత (జూ=) కార్యక్రమం కింద తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఝరాసంగం బాలుర వసతి గృహం, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం సహా పలు ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన విద్యా, వసతి సంబంధిత సామగ్రిని అందించింది. విద్యా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, విద్యార్థులకు మరింత సౌకర్యవంతమైన అభ్యాస వాతావరణం కల్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

ఈ కార్యక్రమం కింద హాస్టళ్లలో నివసిస్తున్న విద్యార్థుల కోసం మొత్తం 295 బంక్ బెడ్‌లు, 590 పరుపులు అందజేశారు. అదనంగా 4 మొబైల్ టాయిలెట్లు, 130 ట్రంక్ బాక్స్‌లు (తాళాలతో), 42 ఇనుప నిల్వ రాక్లు పంపిణీ చేశారు. డిజిటల్ విద్యా అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని 2 కంప్యూటర్లు/డెస్క్‌టాప్‌లు, 3 స్కానర్లతో కూడిన ప్రింటర్లు అందజేశారు. గ్రంథాలయ అభివృద్ధి కోసం 2 లైబ్రరీ రాక్లు, తరగతి గదుల వినియోగం కోసం 3 టేబులు, 8 ప్లాస్టిక్ కుర్చీలు ఇచ్చారు. వసతి గృహ అవసరాల కోసం 50 దోమతెరలు, 15 ఫ్యాన్లు, 2 బీరువాలు/అల్మారీలు, 6 విశాలమైన మ్యాట్లు కూడా సమకూర్చారు. ఈ సామగ్రి ద్వారా విద్యార్థులకు మెరుగైన వసతి, పరిశుభ్రత మరియు అభ్యాస వాతావరణం లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు. హాస్టళ్లలో నివసిస్తున్న విద్యార్థులకు సౌకర్యవంతమైన వసతి ఏర్పాటులో ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతుందని స్థానిక అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, సమాజ అభివృద్ధికి విద్య కీలకమని, భవిష్యత్తులోనూ విద్యారంగానికి తమ వంతు సహకారం కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జగదీశ్వర్, మిత్ర ఓలిస్టిక్ స్వచ్ఛంద సేవ సంస్థ. బీసీ హాస్టల్. కస్తూర్బా గాంధీ హాస్టల్. తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం

**నాగార్జునసాగర్‌లో జిల్లా ప్యానెల్ టీం తనిఖీలు**

**పాఠశాలల్లో అభ్యసన సామర్థ్యాల పెంపునకు**

**జిల్లా స్థాయి బృందం పర్యవేక్షణ**

నాగార్జునసాగర్,ఫిబ్రవరి 20 వాయిస్ టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా నాణ్యతను పెంచడం మరియు మౌలిక వసతులను మెరుగుపరచడమే ధ్యేయంగా జిల్లా స్థాయి ప్యానెల్ ఇన్స్పెక్షన్ బృందం శుక్రవారం నాగార్జునసాగర్ పైలాన్ కాలనీ అభిరామేశ్వర ఉన్నత పాఠశాల మోడల్ హై స్కూల్ లో కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించారు.ఈ సమావేశాల్లో భాగంగా పాఠశాలల్లో అకడమిక్ మరియు నాన్-అకడమిక్ అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు,ఈ కాంప్లెక్స్ సమావేశాల్లో భాగంగా విద్యార్థుల్లో చదవడం,రాయడం మరియు గణిత సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు అమలు చేస్తున్న కార్యక్రమంపై ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు, గ్రంథాలయాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచి చదివే అలవాటు పెంచాలని సూచించారు.పాఠశాలలోని ఫర్నిచర్ నిర్వహణ మరియు మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును బృందం సభ్యులు స్వయంగా పరిశీలించి,నాణ్యత విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి తరి రాము మాట్లాడుతూ,ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించి అభ్యసన లోపాలను అధిగమించేలా చూడాలని కోరారు.జిల్లా పర్యవేక్షణ సభ్యులు వెంకట్ రామ్ నాయక్,ఇరుమాది పాపిరెడ్డి పాఠశాలల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు,ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శేషు,శ్రీనివాస్,వివిధ పాఠశాలల హెచ్.ఎంలు,ఉపాధ్యాయులు సి.ఆర్.పిలు పాల్గొన్నారు.

## భవనం పైనుంచి దూకి.. విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

**అదృష్టవశాత్తు తప్పిన ప్రాణాపాయం**



బోనకల్లు: ఖమ్మం జిల్లా బోనకల్లు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని శుక్రవారం కళాశాల మూడంతస్తుల భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు యత్నించి అదృష్టవశాత్తు గాయాలతో బయటపడింది. ముదిగొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని ఇక్కడ ఇంటర్ ఎంపీసీ చదువుతోంది. శుక్రవారం ఉదయం తరగతులకు హాజరైన అనంతరం రెండో పిరియడ్‌లో వాష్‌రూంకు అని చెప్పి బయటకు వెళ్లింది. అనంతరం ఆమె మూడో అంతస్తు పైకి వెళ్లి అక్కడి నుంచి కిందకు దూకింది.

**తక్షణం స్పందించిన వార్డు సభ్యులు..**

కళాశాల సమీపంలోని రైతు వేదికలో వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం సాగుతోంది. విద్యార్థిని భవనం పైనుంచి దూకడాన్ని గమనించి వారు అప్రమత్తమై అక్కడకు పరుగుతీశారు. బాలిక పడిపోయిన ప్రదేశంలో కొంత ఇసుక ఉండటంతో అదృష్టవశాత్తు పెను ప్రమాదం తప్పింది. వార్డు సభ్యులు ఆమెను ద్విచక్ర వాహనంపై బోనకల్లు పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108లో ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విద్యార్థిని వెన్నెముకకు, కాలుకు గాయాలైనట్లు వైద్యులు గుర్తించారు. అనంతరం కుటుంబీకులు వచ్చి ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు.

పరీక్షల్లో పాసవుతానో..? లేదో..? అన్న మానసిక ఒత్తిడికి గురై ఇలా ప్రవర్తించి ఉండవచ్చని కళాశాల ప్రధానాచార్యులు పి.వెంకటపద్మావతి తెలిపారు. సంఘటనా స్థలాన్ని తహసీల్దార్ మద్దెల రమాదేవి, ఎంఈఓ దామాల పుల్లయ్య సందర్శించి వివరాలు సేకరించారు. విద్యార్థిని మానసిక ఒత్తిడితో ఇందుకు పాల్పడినట్లు అధ్యాపకులు తెలియజేస్తుండగా.. అధ్యాపకుల ఒత్తిడి తట్టుకోలేకే ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై గురుకుల విద్యాసంస్థల జాయింట్ సెక్రటరీ శారద, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, సీడీడీఓ జ్యోతి, గురుకులాల జోనల్ అధికారిణి అలివేలు, కళాశాల ప్రిన్సిపల్ వెంకట పద్మావతికి ఫోన్ చేసి సంఘటనపై ఆరా తీశారు. విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



## కోర్టులో ఏసీబీ కలకలం..

**రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు**

ఉమ్మడి వరంగల్,వాయిస్ టుడే: న్యాయం చెప్పే న్యాయస్థానాల్లోనూ అవినీతి పెట్రేగిపోతుంది. సర్టిఫైడ్ కాపీ ఇవ్వడానికి 5 వేల రూపాయల లంచం డిమాండ్ చేసి ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఘటన శుక్రవారం భూపాలపల్లి జిల్లా కోర్టులో జరిగింది. లంచం స్వీకరిస్తున్న ముగ్గురు కోర్టు సిబ్బందిని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోనే జరిగిన ఈ ట్రాప్ ఆపరేషన్ కోర్టు వర్గాల్లో కలకలం రేపింది. ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం పాలకుర్తి సాయిచరణ్ (కోర్టు స్టెనోగ్రాఫర్), పున్నం రజిత,కొమ్ము సునీతలు కలిసి సర్టిఫైడ్ కాపీ జారీ చేయడానికి బాధితుడు సిహెచ్ గోపాలరావు వద్ద రూ.5 వేల లంచం డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోతే కాపీ జారీ చేయడంలో ఆలస్యం చేస్తామని సూచించడంతో ఏంచేయాలో తోచక బాధితుడు సి.హెచ్.గోపాలరావు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచనల మేరకు ముందస్తు ప్రణాళికతో ట్రాప్ ఏర్పాటు చేశారు. నిర్ణయించిన ప్రదేశంలో లంచం మొత్తాన్ని స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు ముగ్గురిని పట్టుకున్నారు. అనంతరం నిందితుల వద్ద నుంచి లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకుని వారిపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. అదుపులోకి తీసుకున్న ముగ్గురిని విచారణ నిమిత్తం తరలించారు. జిల్లా కోర్టులో జరిగిన ఈ ఘటనతో న్యాయవాదుల వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈఘటనతో జిల్లా కోర్టు పరిధిలో అవినీతి ఆరోపణలు వెలుగుచూడడం ఆందోళన కలిగిస్తోంది.



## నేనెవరిని మోసం చేయలేదు: ఎమ్మెల్యే

వైరా: కష్టపడి ఎదిగిన తాను ఎవరినీ మోసం చేయలేదని వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ వ్యాఖ్యానించారు. స్థానిక పురపాలిక ఛైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ ఛైర్మన్ కట్ల సంతోష్ బాధ్యతల స్వీకార కార్యక్రమం శుక్రవారం పుర కార్యాలయంలో నిర్వహించారు. కార్యాలయం ఆవరణలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదునూరి సీతరాములు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. మేనేజ్‌మెంట్ కోటాలో తాను రాలేదని, కష్టపడే తత్వంతో ముందుకు సాగుతానన్నారు. తనవల్ల పొరబాటు జరిగితే క్షమించాలని.. అభివృద్ధే తన ధ్యేయమన్నారు. ఎమ్మెల్యేగా గెలిపించే క్రమంలో తనతో నడిచిన వారందరి కష్టం నాకు తెలుసంటూ వ్యాఖ్యానించారు. కుటుంబానికి, తనకు ఎలాంటి వ్యాపారాలు లేవన్నారు. మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, డాక్టర్ కాపా మురళీకృష్ణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మాజీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ బోళ్ల గంగారావు, చెరుకూరి చలపతిరావు పాల్గొన్నారు.

## హనుమకొండలో చీఫ్ మినిస్టర్స్ కప్ - 2025 ఎడిషన్ - 2 ప్రారంభం

**ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే,ఎంపీ**



హనుమకొండ,వాయిస్ టుడే: “రూరల్ టు గ్లోబల్ -- క్రాఫ్టింగ్ ఛాంపియన్స్” నినాదంతో నిర్వహిస్తున్న చీఫ్ మినిస్టర్స్ కప్--2025 (ఎడిషన్--2) క్రీడోత్సవాన్ని హనుమకొండలోని జెఎన్‌ఎస్ గ్రౌండ్‌లో ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి మరియు పార్లమెంట్ సభ్యులు కడియం కావ్య,జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడాకారులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ క్రీడోత్సవాలను నిర్వహిస్తోందన్నారు. యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను చాటాలని పిలుపునిచ్చారు. క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ,నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయని పేర్కొంటూ గ్రామీణ ప్రాంతాల నుంచి మరిన్ని ప్రతిభావంతులు రాష్ట్రానికి,దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.యువత క్రీడల్లో రాణించేందుకు ప్రభుత్వం అవసరమైన ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. క్రీడలను కెరీర్‌గా ఎంచుకునే వారికి ఈ వేదిక దోహదపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా అధికారి అశోక్,ఏసీపీ నర్సింగరావు,సారంగపాణి,ప్రభాకర్ రెడ్డి, క్రీడాకారులు, కోచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**